Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్


J.H.Kumar
HANUMAN Digitals
97043 78777,96421 56560
hanumandigitalsvizag@gmail.com
#48-7-46, First Floor, Flower Market,
Srinagar, Ramatalkies Down, VSP - 16
One Stop Solution for your Printing needs....



RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 150 విశాఖపట్నం, 23 మార్చి 2024 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


# 7 ఏళ్లలో 3లక్షల మందిచే సేంద్రీయ వ్యవసాయం : విజయ రామ్





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆరోగ్యవంతమైన జీవితాలకు రసాయన రహిత సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులే మూలాధారమని ప్రఖ్యాత దేశీయ వ్యవసాయ వేత్త విజయ రామ్ అన్నారు. సేవ్ అనే ప్రకృతి వ్యవసాయ రైతు సేవాసంస్థ వ్యవస్థాపకులు విజయ రామ్ ఆధ్వర్యంలో సింహాచలం గోశాలలో ఐదురోజుల శబల భోజన పండుగలు కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయము, దేశవాళి విత్తనాల వ్యాప్తి, స్థానిక ఆహారపు అలవాట్లు, సాంప్రదాయ వంటపాత్రల వినియోగము, స్థానిక చేతి వృత్తుల వారికి జీవనోపాధి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి సేవ్ అనే ప్రకృతి వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఇంతవరకు అవగాహన కల్పించగా ఇప్పుడు ఈ భోజన పండుగల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించబోతున్నట్లు విజయ రామ్ తెలిపారు.

సింహాచలం దేవస్థానం యొక్క కొత్త గోశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, స్థానాచార్యులు టి.పి. వేణుగోపాలాచార్యులు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, దేవాదాయశాఖ సంయుక్త కమిషనర్, అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామచంద్రమోహన్‌లు ప్రత్యేక అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా రామ చంద్రమోహన్ మాట్లాడుతూ తాను కూడా రైతుబిడ్డనని రాష్ట్రంలో సింహాచలం దేవస్థానానికి మాత్రమే వ్యవసాయం చేయగలిగే భూములు ఉన్నాయని, ఈ గోశాల ప్రాంగణంలో కొన్ని ఎకరాల భూమిని సాగులోకి తీసుకువచ్చి ఇక్కడ దేశీయ విత్తనాలతో సేంద్రీయ విధానంలో కూరగాయలు పండిస్తున్నామని, గోవులను పవిత్రంగా సంరక్షిస్తూ గోక్షీరం మరియు పువ్వులను స్వామివారి సేవకు వినియోగిస్తున్నామని అన్నారు. సహజమైన వ్యవసాయం ద్వారా పండించిన పంటలే మానవులకు సరియైన ఆహారమని, దేశం అభివృద్ధి చెందాలంటే సహజమైన ఆరోగ్యం గల భావితరాలు అవసరమని, ప్రజలు సేంద్రీయ వ్యవసాయదారులను ప్రోత్సహిస్తూ సహజమైన పంటలను ఆహారంగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాము ప్రకృతి సిద్ధమైన వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిస్తామని, సేంద్రీయ వ్యవసాయదారులందరూ సింహాచల దేవుని దర్శనం చేసుకొని వారి అనుగ్రహం పొందాలని కోరారు.

తొలుత దేవస్థానం ప్రధానాచార్యులు, శ్రీనివాసాచార్యులు తమ శిష్య బృందంతో వేద పారాయణం చేసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహింపజేశారు. అనంతరం స్థానాచార్యులు మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం మానవుల ఆహారపు అలవాట్లు అంతరించిపోయి అనారోగ్యపూరితమైన ఆహారం ప్రస్తుత జీవనంలో అంతర్భాగమైందని, కేవలం రుచుల మోజులో ప్రజలు ప్రమాదకరమైన ఆహారాన్ని ఆసక్తిగా భుజిస్తున్నారని, దీని ప్రభావం సమాజాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. పురాతన సంప్రదాయ ఆహార పదార్థములైన కుండలో ఉడికించిన అన్నం కుండలో తోడుపెట్టిన పెరుగు, సేంద్రీయ విధానంలో పండించిన బియ్యం మరియు పప్పుదినుసులు మనుష్యుల నిత్య ఆహారంలో ప్రధానంగా ఉండేలా చూసుకుంటే భావితరాలు ధృఢమైన ఆరోగ్యంతో విరాజిల్లగలవని ఆకాంక్షించారు. ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయదారు లందరికీ సింహాద్రి అప్పన్న ఆశీస్సులు మెండుగా లభించేలా ప్రార్థిస్తామని, రైతులు ధైర్యంగా తమ కార్యక్రమాలను కొనసాగిం చాలని, తామంతా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు.

కార్యక్రమ ప్రధాన నిర్వాహకులు విజయ రామ్ మాట్లాడుతూ రాబోయే ఏడు సంవత్సరాలలో సుమారు 3లక్షల మంది రైతులను సేంద్రీయ వ్యవసాయ రంగంలోకి మార్పు చెందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం సేంద్రీయ వ్యవసాయం అధికమైన ఖర్చుతో కూడుకొని ఉందని, ఈ కారణంగా ఉత్పత్తులు స్వల్పంగా ఖరీదైనవిగా కనిపిస్తాయని, ఎక్కువ మంది ఈ రంగంలోకి ప్రవేశించేలా ప్రభుత్వం, ప్రకృతి ప్రేమికులు కృషి చేస్తే సామాన్యులకు కూడా అందుబాటులోకి ప్రకృతి పరమైన ఆహారధాన్యాలు సులభంగా లభిస్తాయని అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రైతులు ప్రత్యేకమైన ఉద్దేశాలతో కూడిన బియ్యం సాగు చేస్తున్నారని, ఈ బియ్యం వినియోగించిన వారు వైద్యంతో పని లేకుండా ఆరోగ్యంగా జీవించగలరని, సంప్ర దాయ ఆహారధాన్యాలు వినియోగించడంలో గల ధరల వ్యత్యాసం మందుల కొనుగోలు కంటే తక్కువగానే ఉంటుందని ప్రజలు గ్రహించవలసిందిగా కోరారు. 21 రకాల వరి ధాన్యాలు వివిధ స్థాయిలలో ప్రజలకు రోగ నివారక ఆహారంగా ఉపయోగపడుతున్నాయని, ఆయా ధాన్యాలు స్వీకరించిన వారికి మధుమేహం, కీళ్లనొప్పులు, వాతపరమైన జబ్బులు ఉండవని, గర్భిణీలకు, బాలింతలకు దివ్యౌషధం లాంటి బియ్యం తమ సహచర వ్యవసాయదారులు సిద్ధం చేశారని ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలలో వీటిని విక్రయిస్తున్నారని తెలిపారు. అలాగే ప్రతీ ఒక్కరూ తమకు గల అవకాశాల మేరకు పెరటితోటలు ఏర్పాటు చేసుకొని సహజమైన విత్తనాలను నాటి తమకు నిత్యం వినియోగార్హమైన కూరగాయలు, ఆకుకూరలు పండించుకొని ఆరోగ్యంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. శుక్రవారం ఈ కార్యక్రమం ప్రారంభం కాగా సుమారు 1500 మందికి ప్రకృతి సేద్యపు ఆహార ధాన్యాలతో సాంప్రదాయబద్ధంగా వండిన భోజనాన్ని ఉచితంగా అందించారు. శని, ఆది, సోమ,



మంగళవారాల్లో కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని శబల భోజన పండుగలను విజయవంతం చేయాలని విజయ రామ్ పిలుపునిచ్చారు.



# ప్రధాని మోదీకి భూటాన్ అత్యున్నత పౌర గౌరవం 'ఆర్డర్ ఆఫ్ డ్రుక్ గ్యాల్పో' ప్రదానం



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరో అత్యున్నత పౌర గౌరవం దక్కింది. ప్రధాని మోదీ శుక్రవారం భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద డ్రక్ గ్యాల్పో'ను అందుకున్నారు. భూటాన్ దేశ అత్యున్నత పౌర గౌరవాన్ని అందుకున్న మొదటి విదేశీ ప్రభుత్వాధినేత ప్రధాని మోదీ కావడం విశేషం. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గ్యాల్ వాంగ్‌చుక్ ప్రధాని మోదీని 'ఆర్డర్ ఆఫ్ ద డ్రక్ గ్యాల్పో'తో సత్కరించారు. ఈ గౌరవానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని మోదీ.. ఈ గౌరవాన్ని 140 కోట్ల మంది భారతీయులకు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.

భూటాన్ రాజధానిలో ఇరువురు నేతలు భేటీ అయిన తర్వాత, భూటాన్ రాజు జిగ్మే ప్రధాని మోదీకి ఆర్డర్ ఆఫ్ ద డ్రక్ గల్పోను ప్రదానం చేశారు. ర్యాంక్, ప్రాధాన్యత ప్రకారం, ఆర్డర్ ఆఫ్ ది డ్రక్ గల్పో జీవితకాల సాఫల్య పురస్కారంగా భూటాన్ ప్రభుత్వం భావిస్తుంది. ఇది భూటాన్‌లో అత్యున్నత గౌరవం. అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, భారతీయుడిగా జీవితంలో ఈరోజు గొప్ప రోజు. త ఇంతకు ముందు ఏ భారత ప్రధానికి రాజు ప్రైవేట్ విందు ఇవ్వలేదు. ప్రధాని మోదీకి ఈ ప్రత్యేక హోదా కల్పిస్తున్నారు. కె5 రెసిడెన్స్ లింగనా ప్యాలెస్‌లో భారత ప్రధానికి ఆతిథ్యం ఇవ్వడం ఇదే

(మిగతా 2లో)

# ఏయూను సందర్శించిన అమెరికా నావికాదళ బృందం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికా నావికాదళ బృందం శుక్రవారం ఉదయం సందర్శించారు. ముందుగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో పరిపాలనా భవనంలో సమావేశమయ్యారు. యుఎస్ నేవీ కెప్టెన్ కమాండింగ్ ఆఫీసర్, ఎస్ఎస్ఎస్ సోమిర్‌సెట్(ఎల్‌పిడి 25) కెప్టెన్ మిచెల్ సి. బ్రాండ్ నేతృత్వంలో పలువురు నావికాదళ సిబ్బంది ఏయూను సందర్శించారు. వీరికి ఏయూ ఎన్‌సిసి విద్యార్థుల బృందం గౌరవ వందనంతో స్వాగతించారు. అనంతరం అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా నావికాదళ సిబ్బందిని ఉద్దేశించి వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి

(మిగతా 2లో)

# తెదేపా మూడో జాబితా విడుదల

**అమరావతి:** తెదేపా అభ్యర్థుల మూడో జాబితా విడుదలైంది. 11 శాసనసభ స్థానాలతో పాటు 13 ఎంపీ అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. పొత్తులో భాగంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో తెదేపా పోటీ చేయనుంది. ఇదివరకే 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. తాజాగా మరో 11 మందిని వెల్లడించింది. 5 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలను పెండింగులో ఉంచింది.

**అసెంబ్లీ స్థానాల అభ్యర్థులు..**

పలాస-గౌతు శిరీష, పాతపట్నం- మామిడి గోవిందరావు, శ్రీకాకుళం-గొండు శంకర్, శృంగవరపుకోట- కోళ్ల లలితకుమారి, కాకినాడ సిటీ- వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), అమలాపురం (ఎస్సీ)- అయితాబత్తుల ఆనందరావు, పెనమలూరు-బోడె ప్రసాద్, మైలవరం- వసంత వెంకట కృష్ణప్రసాద్,

(మిగతా 2లో)




(మొదటి పేజీ తరువాయిలు)

## ప్రధాని మోదీకి భూటాన్ అత్యున్నత పౌర గౌరవం 'ఆర్డర్ ఆఫ్ డ్రుక్ గ్యాల్పో' ప్రదానం

తొలిసారి. భారత ప్రధానికి భూటాన్ అత్యున్నత పురస్కారం ఇవ్వడం తొలిసారి. నిజానికి భూటాన్ అవార్డు పొందిన తొలి విదేశీ పౌరుడు ప్రధాని మోదీ.

భూటాన్ పర్యటన సందర్భంగా భూటాన్ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ మోదీని ఈ అవార్డుతో సత్కరించారు. థింపూలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో మోదీ ప్రసంగించారు. "ఈ గౌరవం నా వ్యక్తిగత విజయం కాదు, ఇది 140 కోట్ల మంది భారతీయుల గౌరవం. ఈ గొప్ప భూటాన్ భూటాన్‌లోని భారతీయులందరి తరపున ఈ గౌరవాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నాను. ఈ గౌరవానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను." అని అన్నారు.

"భారతీయుడిగా నా జీవితంలో ఈరోజు గొప్ప రోజు. మీరు నన్ను భూటాన్ అత్యున్నత జాతీయ అవార్డుతో సత్కరించారు. ప్రతి అవార్డు దానికదే ప్రత్యేకమైనది. కానీ మరొక దేశం నుండి అవార్డు అందుకున్నప్పుడు, రెండు దేశాలు సరైన దిశలో పయనిస్తున్నాయనే విశ్వాసాన్ని బలపరుస్తుంది. భారతదేశం, భూటాన్ మధ్య సంబంధాలు కొత్తవేమి కావని, మరియు సమకాలీనమైనవి, పురాతనమైనవి. 2014లో భారత ప్రధాని అయ్యాక, తొలి విదేశీ పర్యటనగా భూటాన్‌ను సందర్శించడం జరిగింది. 10 సంవత్సరాల క్రితం భూటాన్ అందించిన స్వాగతం, ఆప్యాయత ప్రధానమంత్రిగా నా విధి పర్యటన ప్రారంభాన్ని చిరస్మరణీయం చేసింది." అని అన్నారు.

రెండు రోజుల పర్యటన నిమిత్తం మార్చి 22న భూటాన్‌కు చేరుకున్నారు ప్రధాని మోదీ. భారతదేశం భూటాన్‌ల మధ్య క్రమం తప్పకుండా ఉన్నత స్థాయి మార్పిడి సంప్రదాయానికి అనుగుణంగా ఈ పర్యటన కొనసాగుతోంది. పారో విమానాశ్రయంలో ప్రధానికి ప్రధాని షెరింగ్ టోబ్గే ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ పీఎం టోబ్గేతో చర్చలు జరిపారు. పారో అంతర్జాతీయ విమానాశ్రయం నుండి థింపూ వరకు 45 కి.మీ పొడవునా ఇరువైపులా నిలబడి ఉన్న భూటాన్ ప్రజలు ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలికారు. రాజధానిలో ప్రధాని మోడీ గౌరవార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో అనేక సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వాటిలో ముఖ్యంగా గర్బా ప్రదర్శన, ఇందులోని పాటకు ప్రధాని మోదీ స్వయంగా పదాలు కలిపారు.

ఇదిలావుంటే భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద డ్రక్ గ్యాల్పో' అవార్డును ఇప్పటివరకు కేవలం నలుగురికి మాత్రమే అందించారు. 2008లో, హర్ మెజెస్టి ది రాయల్ క్వీన్ అమ్మమ్మ ఆషి కేసంగ్ చోడెన్ వాంగ్‌చుక్ అవార్డును అందుకున్నారు. 2008లో ట్రిజుర్ టెన్జిన్ డెండుప్ (భూటాన్‌కు చెందిన 68వ జె ఖెన్పో), 2018లో జె ఖెన్పో ట్రుల్కు నావాంగ్ జిగ్మే చోద్రా ద్వారా అందుకున్నారు. భూటాన్ కేంద్ర సన్యాసుల ప్రధాన నాయకుడు జె ఖెన్పో.

మరోవైపు భూటాన్ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరుదైన అతిథ్యం లభించింది. ఇంతకు ముందు ఏ భారత ప్రధానికి భూటాన్ రాజు ప్రైవేట్ విందు ఇవ్వలేదు. కానీ ప్రధాని మోదీకి ఈ ప్రత్యేక హోదాను కల్పించారు భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గ్యాల్ వాంగ్‌చుక్. కె5 రెసిడెన్స్ లింగనా ప్యాలెస్‌లో భారత ప్రధానికి ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. అలాగే విదేశీ ప్రతినిధికి భూటాన్ అత్యున్నత పురస్కారం ఇవ్వడం సైతం ఇదే తొలిసారి. నిజానికి భూటాన్ అవార్డు పొందిన తొలి విదేశీ పౌరుడు ప్రధాని మోదీ కావడం విశేషం.

## ఏయూను సందర్శించిన అమెరికా నావికాదళ బృందం

ప్రసంగించారు. ఏయూలో ఒక మల్టీడిసిప్లీనరీ విశ్వవిద్యాలయంగా నిలుస్తుందన్నారు. క్రీడలు, యోగా, సైకాలజీ, సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ వంటి వైవిధ్యత కలిగిన విభాగాలు ఉన్నాయన్నారు. దేశంల రక్షణ రంగాలకు విద్యపరంగా సేవలు అందిస్తున్న వర్సిటీకి ఏయూ పేరుగాంచిందని వారికి వివరించారు. వైవిధ్యతను తాము స్వాగతిస్తామని, యుఎస్ఏ నావికలు తమ ఆలోచనలను పంచుకోవాలని కోరారు. మంచి స్నేహాన్ని తాము కోరుకుంటామన్నారు. ప్రపంచాన్ని అంత్యంత ఆనందాయకంగా నిలపాని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత దేశంలో త్రివిధ దళాల ఉద్యోగులకు ఉన్నత విద్యను చేరువ చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని, భవిష్యత్తులో విదేశీ సైనికులకు సైతం ఉన్నత విద్య అవకాశాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

అమెరికా నావికాదళం కమాండింగ్ ఆఫీసర్ మిచెల్ సి. బ్రాండ్ మాట్లాడుతూ సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుగాంచిన విశాఖ నగరం తమకు ఎంతో నచ్చిందన్నారు. సముద్రతీరం, ఎత్తైన కొండలు కలిగిన ఈ ప్రాంతం తమకు నచ్చిందన్నారు. భారతీయ సంస్కృతిని తాము నేర్చుకుంటున్నామన్నారు. విభిన్న విభాగాలతో పెద్ద విశ్వవిద్యాలయంగా ఏయూ తమకు కనిపిస్తోందన్నారు.

కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అమెరికన్ ఎంబసీ అధికారి జో క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ అమెరికన్ కార్నర్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం, వాల్ పెయింటింగ్ కార్యక్రమాలలో అమెరికా నావికాదళ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అమెరికన్ కార్నర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా నావికాదళం కమాండింగ్ ఆఫీసర్ సి.బ్రాంట్ ప్రసంగించారు.

### తెదేపా మూడో జాబితా విడుదల

నరసరావుపేట- చదలవాడ అరవిందబాబు, చీరాల- మద్దులూరి మాలకొండయ్య యాదవ్, సర్వేపల్లి- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

**లోక్‌సభ స్థానాల అభ్యర్థులు..**

శ్రీకాకుళం- కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విశాఖపట్నం- మతుకుమిల్లి భరత్, అమలాపురం- గంటి హరీష్, ఏలూరు- పుట్టా మహేశ్ యాదవ్, విజయవాడ- కేశినేని శివనాథ్ (చిన్ని), గుంటూరు- పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట- లావు శ్రీకృష్ణ దేవరాయలు, బాపట్ల- టి.కృష్ణ ప్రసాద్, నెల్లూరు- వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు- దగ్గుమళ్ల ప్రసాదరావు, కర్నూలు- బస్తిపాటి నాగరాజు (పంచలింగాల నాగరాజు), నంద్యాల- బైరెడ్డి శబరి, హిందూపురం- బీకే పార్థసారథి.

# స్వచ్ఛతా పఖ్వాడా 2024' ప్రచారంలో భాగంగా 'బాల స్వచ్ఛతా జాగృతి'




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్వచ్ఛతా పఖ్వాడా 2024' ప్రచారాన్ని ఆర్ఐఎన్ఎల్, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో మార్చి 16 నుండి 31 మార్చి 2024 వరకు నిర్వహిస్తోంది.

ఈ స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమం 2024లో భాగంగా, విశాఖ ఉక్కు కర్మాగారం యొక్క కార్పొరేట్ సంస్థ అయిన ఆర్ఐఎన్ఎల్ శుక్రవారం మిందిలోని జెడిపిహెచ్ స్కూల్లో తీసుకున్న స్వచ్ఛతా ప్రతిజ్ఞ లో 1,050 మంది పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు అధికారులు మరియు ఆర్ఐఎన్ఎల్ ఉద్యోగుల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేసిన అనంతరం 'బాల స్వచ్ఛతా జాగృతి' అనే ప్రత్యేక కార్యక్రమం, 'వ్యక్తిగత పరిశుభ్రత, 'సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ ప్లాస్టిక్‌ను అరికట్టడం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరువాత, జడ్పీహెచ్ స్కూల్, మిందిలో "మేరా దస్ మినిట్" -అనే టీమ్ వర్క్ ద్వారా 40 మంది విద్యార్థులు ఈ ప్రత్యేక ప్రచారంలో పాల్గొన్నారు మరియు 10 నిమిషాల వ్యవధిలో విద్యార్థులు పాఠశాల ఆవరణలోని వ్యర్థ పదార్థాలు మొత్తం 'ప్లాస్టిక్‌ను ఏరి , పారవేసారు.

ఈ ప్రత్యేక కార్యక్రమాలను విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యొక్క కార్పొరేట్ సంస్థ అయిన ఆర్ఐఎన్ఎల్ యొక్క కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం సమన్వయం చేసింది.

# గాయత్రీ విద్యా పరిషత్ కళాశాల వార్షికోత్సవం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గాయత్రి విద్యా పరిషత్ కళాశాల రుషికొండ బ్రాంచ్ (B.B.M., B.C.A.M.B.A., ఇంజనీర్) విశాఖ పట్నం రుషికొండ శాఖ వార్షికోత్సవం శుక్రవారం ఓపెన్ ఆడిటోరియంలో జరిగింది.ఈ వార్షికోత్సవ కార్యక్రమాన్ని పి.నాగ సాయి ఎం. ఆధ్వర్యంలో బి.ఎ ప్రార్థనా గీతంతో ప్రారంభించారు. వా.శ్రీనిధి. ముఖ్య అతిథిగా విశాఖపట్నం నేషనల్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ (ఇండివిడ్యువల్) డాక్టర్ సురేష్ చంద్ర పాండే వచ్చారు. డాక్టర్ సాయి రూప్, స్టూడెంట్ డీన్ గాయత్రి విద్యా పరిషత్ అతిథులకు స్వాగతం పలికారు. రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య పి.వి. శర్మ గారు అతిథికి స్వాగతం పలికి సభకు అధ్యక్షత వహించారు. దేశ భవిష్యత్తుకు విద్యార్థులే పునాది అని, ఉపాధ్యాయుడు విద్యార్థులు, తల్లి దండ్రులు, సమాజం విశ్వసించాల్సిన అవసరం ఉందని, ఈ నమ్మకాన్ని సంపూర్ణంగా నెరవేర్చడం అతని కర్తవ్యమని గాయత్రి విద్యా పరిషత్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రజనీ జీ తన సందేశంలో పేర్కొన్నారు. భక్తి.. అంటూ విద్యార్థులందరినీ అభినందించి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

అకడమిక్ ఎఫిషియెన్సీ డీన్, గాయత్రీ విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కోర్సుల కళాశాల డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య పి.వినయ్ వార్షిక నివేదికను సమర్పించారు, ఇది అకడమిక్ మరియు కో-కరిక్యులర్ కార్యకలాపాలలో కళాశాల సాధించిన విజయాలను హైలైట్ చేసింది. ముఖ్య అతిథి పరిచయం జి. సౌజన్య లక్ష్య, అసోసియేట్ ప్రొఫెసర్ ECE విభాగం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన వేదికపైకి ఇంద్రధనుస్సును తీసుకొచ్చింది. ముఖ్యఅతిథి డాక్టర్ సురేష్ చంద్ర పాండే, డైరెక్టర్ (పర్సనల్) నేషనల్ కార్పొరేషన్ లిమిటెడ్, విశాఖపట్నం తన ప్రసంగంలో నైతిక విలువలు మరియు సమకాలీన అంశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన ఆదర్శాలను ప్రశంసించారు.అత్యుత్తమ పరీక్ష ఫలితాలు మరియు విజయాలు సాధించినందుకు పాఠశాల కుటుంబాన్ని అభినందించారు. సహ పాఠ్య కార్యకలాపాలు మరియు పిల్లలలో నైతిక విలువలను పెంపొందించడంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్రను పేర్కొనడం. ఈ కార్యక్రమాలను విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయిబాల నిర్వహించారు.బృంద పాటలు, బృంద నృత్యాలు, హిందీ, ఇంగ్లీషు నృత్యాలు, స్టేజీ ప్రదర్శనల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ప్రతిభావంతులైన మరియు ప్రతిభావంతులైన (విద్యా మరియు క్రీడలు) విద్యార్థులందరికీ అవార్డులు ఇవ్వడం ద్వారా ఉత్సాహాన్ని పెంచారు. వందన సమర్పణ B.B.A. విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీమతి V. సౌజన్య చేశారు. గౌరవనీయులైన ఆచార్య పి.రాజగణపతి G.P.R.O. పద్మాజీ, విభాగాధిపతి, ఆచార్యులు, ప్రెస్ మరియు మీడియా వారు పాల్గొని విజయవంతం చేసారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.

# 26వ తేదీలోగా పెండింగ్ ఫారాలు పరిష్కరించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ఎన్నికలలో రాజకీయ పార్టీలు ప్రచారానికి అనుమతులు తప్పనిసరి అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎన్నికల నిర్వహణపై విజయవాడ నుంచి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం -7, ఫారం-8లను (షెడ్యూల్ విడుదల ముందు తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులకు) చట్టబద్ధమైన విధానంలో మార్చి 26వ తేదీ లోగా పరిష్కరించాలని ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదు విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, చివరి నిమిషంలో హడావుడిగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టవద్దని, క్రమపద్ధతిలో వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఫారం-6లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మాత్రమే నూతన ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటువంటి కార్యక్రమాలకైనా, ఇంటింటి ప్రచారానికైనా ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. నేరుగా గానీ, ఎన్కోర్ పోర్టల్ ద్వారా గానీ అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనమతులను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో సీజర్స్ అంశంపై ఎన్ఫోర్సుమెంట్ ఏజెన్సీలను అప్రమత్తం చేయాలని, జిల్లా పరిధుల్లోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రతి రోజూ తొమ్మిది నివేదికలను భారత ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ఏమాత్రం అలక్ష్యం వహించకుండా సకాలంలో నివేదికలను అందజేయాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా విశాఖపట్టణం జిల్లాలో అనుసరిస్తున్న విధానాల గురించి, చేపడుతున్న చర్యల గురించి ఎం.సి.సి. జిల్లా నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ సీఈవోకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వాడండి

**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):** మార్చి 22 న ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారంనాడు రాంబిల్లిలో స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులందరికీ నీటి ప్రాధాన్యతని, సంరక్షణ బాధ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్ జి.ప్రమీల మాట్లాడుతూ పర్యావరణాన్ని కలుషితం కాకుండా చూడడం ద్వారా, మొక్కలు నాటడం ద్వారా, నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు నీరు అందుబాటులో ఉండే విధంగా చేయాలని పిలుపునిచ్చారు. సైన్స్ ఉపాధ్యాయురాలు పి. కళ్యాణి మాట్లాడుతూ భూగర్భ జలాలు ఇంకిపోకుండా నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటి వనరుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ, విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు.




**పంచాంగం**

శనివారం 23-03-2024
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం ,శిశిర ఋతువు
ఫాల్గుణమాసం

| | |
|---|---|
| తిథి | : శు. త్రయోదశి ఉ. 07.12 త. చతుర్దశి |
| నక్షత్రం | : పుబ్బ పూర్తి |
| వర్జ్యం | : ప. 01.34 ల 03.20 |

## సాఫ్ట్ స్కిల్స్ లో ప్రావీణ్యం సంపాదిస్తే ఉజ్వల భవిత సొంతం!



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నేటి ఆధునిక కాలంలో సాఫ్ట్ స్కిల్స్ లో మంచి ప్రావీణ్యం సంపాదిస్తే ఉజ్వల భవిత సొంతం అవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. వెర్చ్ కన్సల్టింగ్ సీఇఓ డాక్టర్ చిక్కాల వేణుగోపాల్ రచించిన మూడు సాధికారత పుస్తకాలను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి చేసుకున్న వారే అన్ని రంగాల్లోనూ అందరి కంటే ముందుంటా రన్నారు. రచయిత వెర్చ్ కన్సల్టింగ్ సిఇఒ డాక్టర్ చిక్కాల వేణుగోపాల్ మాట్లాడుతూ సాఫ్ట్ స్కిల్స్ ప్రావీణ్యంలో గణనీయ మార్పులు తీసుకురావడానికి, ప్రభావ వంతమైన నాయకత్వాన్ని ప్రేరేపించడానికి మరియు కలకాలం ప్రభావ వ్యూహాలను బహిర్గతం చేయడానికి ఉద్దేశించి ఈ పుస్తకాలను వ్రాశానన్నారు. తన సుదీర్ఘమైన, పారిశ్రామిక అనుభవంతో, హైదరాబాద్లో ప్రఖ్యాత కంపెనీల సిఇఒలు, మేనేజింగ్ డైరక్టర్లతో కలిసి పని చేయడం ద్వారా తెలుసుకున్న పలు ముఖ్యమైన విషయాలను ఈ పుస్తకాల్లో పొందుపరిచా నన్నారు. సమకాలీన వ్యాపార అవసరాలకు సమర్థవం తమైన పరిష్కారాలను పెంపొందించడం, నిపుణులు మరియు పారిశ్రామికవేత్తల మధ్య అంతరాన్ని తగ్గించడం తదితర విషయాలను వీటిలో ప్రస్తావించానన్నారు.

## పలు వార్డులలో జనసేన కుటుంబాలను సందర్శించిన వంశీకృష్ణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దక్షిణ నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీ వంశీ కృష్ణ శ్రీనివాస్ గారు దక్షిణ నియోజకవర్గంలో పలు వార్డులలో జనసైనికుల కుటుంబాలను సందర్శించారు , గురువారం అరెస్ట్ అయిన 34వ వార్డ్ జనసేన అధ్యక్షులు వాసుపల్లి నరేష్ గారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలకు ధైర్యం చెప్పి మీకు నేను ఉన్నాను అని భరోసా ఇచ్చారు. అనంతరం 35వ వార్డ్ జనసేన సెక్రటరీ రఘు గారి ఇంటికి వెళ్లి పరామర్శించారు . తరువాత 39వ వార్డ్ జనసేన అధ్యక్షులు మైలపల్లి తాతారావు గారి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు,ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ మా జనసేన నాయకులపైనా , కార్యకర్తలపైనా ఎవరు ఎన్ని (వై ఎస్ ఆర్ సి పి తో కుమ్మక్కై, ) కుట్రలు చేసిన విశాఖ దక్షిణంలో జనసేన గెలుపును ఎవరు ఆపలేరన్నారు.

ఈ కార్యక్రమంలో వంశీకృష్ణతో పాటు దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త పిట్టా శివ ప్రసాద్ రెడ్డి, 33వ వార్డ్ కార్పొరేటర్ బిశెట్టి వసంత లక్ష్మి , 32వ వార్డ్ జనసేన అధ్యక్షులు తెలుగు అర్జున్ ,

తెలుగు దేశంపార్టీ వార్డ్ అధ్యక్షులు బుచ్చా రామిరెడ్డి , పిల్లి రమణ మాజీ కార్పొరేటర్ , గుల్లిపిల్లి ఆనంద్ మాజీ కార్పొరేటర్ మరియు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
వార్తలకు, ప్రకటనలకు
సెల్: 9393949345,
8247526179

విశాఖ సమాచారమ్
శనివారం 23-03-2024

## తల రాత

మనం పుట్టినప్పుడే భగవంతుడు మన తలరాతని రాసేస్తాడు కదా, మరి మనం పూజలు ఎందుకు చేయాలి అని కొంతమందికి అనుమానం వస్తుంది.

అయితే బ్రహ్మ నుదుటిని రాత రాసేటప్పుడు అందులోనే ఒక మాట రాసాడట.

నేను రాసే రాతను నేను కూడా తప్పించలేను. మీరు మీ ఉపాసనలతోటి, మీ అర్చనలతోటి మార్చుకోగలరు అని రాసాడట. అర్చనలు, ఉపాసనలు కర్మఖాండ ద్వారా మీ విధిని మీ చేతుల్లో పెడతున్నాను అని తెలిపారు.

ఉదాహరణకి ఒక వ్యక్తికి బ్రహ్మ 100 ఏళ్ళు ఆయువు రాస్తే, ఆ వ్యక్తి చేసే పాపాలను బట్టి ఆవ్యక్తి ఆయువు తగ్గుతుంది. ఈ తగ్గిన ఆయువుని తిరిగి పూర్చుకునే శక్తి కూడా మనకి కర్మకాండ ద్వారా చేసుకోమని బ్రహ్మ చెప్పాడు. పురాణాలు శ్రద్ధగా వింటే ఒక్కొక్క అక్షరం మన పాపాలను తొలగిస్తుంది.

పూర్వం విభుముఖుడు అనే రాజు ఉండేవాడు, ఇతనికి 50 వ ఏట మరణ గండం ఉంది. ఆ మరణ గండాన్ని ఎవ్వరు తప్పించలేరని రాసాడు బ్రహ్మ. అతని అదృష్టం బాగుండి ఒక గురువుని ఆశ్రయించి, గురువు చెప్పినట్టు అర్చన, మృత్యుంజయ జపం చేసి చావవలసినవాడు బ్రతికాడు. జాతకం రాసిన జ్యోతిష్యులు ఆశ్చర్యపోయి జాతక రీత్యా వీడు చచ్చిపోవాలండి, కాని బ్రతికాడని అనుకుంటే అప్పుడు వశిష్ట మహర్షి ఇలా అన్నాడు. ఇతనికి జాతక రీత్యా చావు ఉన్నప్పటికి గురువుగారి ద్వారా మృత్యుంజయ మంత్రాన్ని ఉపాసనగా పొంది జపం చేసి దాని ఫలితం వలన మృత్యుగండం నుంచి బయట పడ్డాడని చెప్పాడు.

కాబట్టి బ్రహ్మ రాసిన రాత బ్రహ్మ మార్చడు గాని, మనం ఇలా పురాణాలను శ్రద్ధగా వినడం, మంత్రాలను చదవడం, ప్రదక్షణలు చేయడం వలన చాలా వరకు బ్రహ్మరాత పాతది తొలగిపోయి కొత్తది వస్తుంది.ఆపద వచ్చినప్పుడు ఏడుస్తూ కూర్చోకుండా అమ్మవారి పాదాలను రెండిటిని స్మరించాలి. అమ్మ పాదాలను స్మరించడం వలన బ్రహ్మ వంటి దేవతలను మనకు సేవకులను చేస్తుంది.

128 ఏళ్ల ఆయువు ఉన్న దుర్యోధనుడు, ద్రౌపతిని జుట్టుపట్టి దుశ్యాసునితో ఈడ్పించడం వలన చేసిన పాపానికి 60 వ ఏట చనిపోయాడు. కాబట్టి ఆయువు ఉన్నప్పటికీ, బ్రహ్మ రాసినప్పటికీ చేసిన పాపానికి నశించాడు. అదే పుణ్యం వలన రాత మార్చుకుని సుఖంగా బ్రతికినవాళ్ళు ఉన్నారు.

అందుకని ఏ కష్టం వచ్చినా బ్రహ్మ నాకు ఇలా రాసాడు అని కృంగిపోకుండా ఆ రాతను మార్చుకోవడానికి పూజలు, దానాలు, ధర్మాలు, పేదలకు సహాయం చెయ్యండి.

# ఆర్ఐఎన్ఎల్‌లో ఘనంగా జరిగిన ప్రపంచ నీటి దినోత్సవం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆర్ఐఎన్ఎల్ శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని జరుపుకుంది.

ప్రపంచ నీటి దినోత్సవంలో భాగంగా పలువురు నీటి యాజమాన్య శాఖ (వాటర్ మానేజిమెంట్ డిపార్ట్మెంట్) ఉద్యోగులు, ఇతర విశాఖ ఉక్కు సిబ్బంది , కాంట్రాక్టు కార్మికులు నీటి పొదుపు నినాదాలు, పేకాటలతో ప్రధాన గేటు వద్ద మానవహారంగా ఏర్పడ్డారు.

ప్రధాన కార్యక్రమం ఆర్ఐఎన్ఎల్ యొక్క ఈడీ (వర్క్స్) భవనం యొక్క ప్రధాన సమావేశ మందిరంలో ఎ.కె. సోబ్తి, సీజీఎం (పనులు)- ఐ/సీ ఆర్ఐఎన్ఎల్ అధ్యక్షతన నిర్వహించబడింది.

ముందుగా వాటర్ మానేజిమెంట్ డిపార్ట్మెంట్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ స్వాగతమ్ పలికారు.

అనంతరం, ప్రపంచ నీటి దినోత్సవం థీమ్ "శాంతి కోసం నీరు" అనే అంశంపై విశాఖపట్నంలోని ఐఐఎంకి చెందిన ప్రొఫెసర్ ఎం.విజయ భాస్కర్ పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు.

తన పవర్ పాయింట్ ప్రెసెంటేషన్లో, ప్రొఫెసర్ ఎం. విజయ భాస్కర్ వివిధ నీటి సంబంధిత ప్రాజెక్టులలో తాను అమలు చేసిన ప్రస్తుత సాంకేతిక ఆవిష్కరణల గురించి మాట్లాడారు. అతను ఐఓటి (ఇంటర్నెట్ అఫ్ థింగ్స్) పరికరాలు మరియు కంప్యూటర్ దృష్టిని ఉపయోగించి ఫిన్లాండ్ మరియు నెదర్లాండ్స్‌లో ఈ కొలి బ్యాక్టీరియాను పైలట్ ప్రాజెక్ట్‌గాగుర్తించినట్లు తెలిపారు. నీటి సంబంధిత పరిశ్రమలలో పంపిణీ చేయబడిన లెడ్జర్ల నవీకరణ కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని కూడా ఉపయోగించినాట్లు తెలిపిన ముఖ్య వక్త ప్రొఫెసర్ విజయ్ భాస్కర్ ఆర్ఐఎన్ఎల్‌లో అమలు చేస్తున్న వివిధ నీటి సంరక్షణ చర్యలను అభినందించారు.

ముఖ్య అతిథిగా ప్రసంగించిన ఎకె సోబ్తి, సిజిఎం(వర్క్స్)-ఇంఛార్జి, ఆర్ఐఎన్ఎల్ నీటి సంరక్షణ గురించి వివరించారు. ఉక్కు పరిశ్రమలు నీటి వినియోగం మరియు నీటి వనరులు కొరతగా మారుతున్నందున, ఐఆర్ 4.0 (పరిశ్రమ 4.0) యొక్క ఈ యుగంలో ఉత్తమ నీటి నిర్వహణ పద్ధతులను మరియు సాంకేతికతను ఉపయోగించవలసిన ఆవశ్యకత గురించి ఏ కె సోబటి వివరించారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు చురుకుగా పాల్గొన్న వివిధ కేటగిరీల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రముఖులు బహుమతులు అందజేశారు.

ఆర్ఐఎన్ఎల్ తన నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా జీరో వాటర్ డిశ్చార్జ్, శుద్ధి చేసిన టౌన్‌షిప్ మురుగునీటిని అల్ట్రా ఫిల్ట్రేషన్ యూనిట్ అవుట్‌పుట్‌తో నీటిని తయారు చేయడం మరియు అధిక సైకిల్ తో నీటిని ఉపయోగించేందుకు రసాయన శుద్ధి చర్యలు వంటి అనేక చర్యలను ఏ కనెక్ట్ చేయబడిన ఉత్పత్తి యూనిట్లను ప్రభావితం చేయకుండా తీసుకుంటోందని గమనించగలరు.

ఇటువంటి గణనీయమైన మార్పులతో, ఆర్ఐఎన్ఎల్ యొక్క నీటి వినియోగం ఉక్కు పరిశ్రమలో అత్యల్ప నీటి వినియోగ రేటుగా పరిగణించబడే అనేక సంవత్సరాల పాటు టన్ను లిక్విడ్ స్టీల్‌కు 2.3-మీటర్ల క్యూబ్‌గా ఉంది. కొన్ని ప్రాంతాలలో గార్డెనింగ్ వంటి కార్యకలాపాల కోసం శుద్ధి చేయబడిన మురుగునీటిని ఉపయోగించడం చర్యలు కూడా చేపట్టి నీటిని పొదుపు చేస్తున్నారు.

నీటి సంరక్షణ కోసం అనేక చర్యలతో ప్రారంభం నుండి ఆర్ఐఎన్ఎల్ తన నీటి అవసరాన్ని చాలా కనిష్ట స్థాయిలో నిర్వహించగలుగుతుంది మరియు ఆర్ఐఎన్ఎల్ ఉద్యోగులందరి క్రియాశీల ప్రమేయంతో భవిష్యత్తులో కూడా అదే విధంగా నిర్వహించడానికి కట్టుబడి ఉంది.

ఈనాటి కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, సంఘాలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం వినియోగాన్ని విస్తృత పర్చండి

● ఏప్రిల్ 3 న సీజర్ పై సి.ఎస్, డిజిపిలతో ఇ.సి. సమీక్ష ● ఎన్నికల విధులో పాల్గొనే ఉద్యోగుల ఆప్షన్ మేరకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



**వెలగపూడి:** వచ్చే నెల 3 వ తేదీన సీజర్ అంశంపై సి.ఎస్, డిజిపిలతో భారత ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఎలక్షన్ సీజర్ మేనేజ్మంట్ సిష్టం వినియోగాన్ని విస్తృత స్థాయిలో మెరుగు పర్చాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన మీడియా కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజర్ అంశంపై ఎన్ఫోర్సుమెంట్ ఏజన్సీలను అప్రమత్తం చేయాలని, జిల్లా పరిధుల్లోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో కూడా నిఘాను పటిష్టపర్చాలన్నారు. ప్రతి సరిహద్దు చెక్ పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వలెన్సు టీమ్ ను ఉంచాలన్నారు. భారత ఎన్నికల సంఘం జారీచేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం దాదాపు 33 నిత్యావసర సేవల శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. వీటిలో ముఖ్యంగా పోలీస్, విద్యుత్, రవాణా, పోస్టల్ తదితర శాఖలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులతో పాటు ఆయా శాఖల ఉద్యోగులకు వారి విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో నున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటు వంటి కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి తప్పని సరిగా పొందాల్సి ఉందన్నారు. అయితే నేరుగా గానీ, ఎన్కోర్ పోర్టల్ ద్వారా గానీ అందే ధరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనమతులను మంజూరు చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటు వంటి దురటనలకు తావులేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దురదృష్టవశాత్తు ఎటు వంటి దురటనలు జరిగినా తక్షణమే తగు చర్య తీసుకోవడంతో పాటు ఆ సంఘటనకు సంబందించిన వాస్తవ నివేదితను వెంటనే తమ పంపాలన ఆదేశించారు. ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగింపుకు సంబందించి పెండింగ్ లో ఉన్న ఫార్మ్-7 లను మరియు వివరాలను సరిదిద్దేందుకు సంబందించి పెండింగ్ లో నున్న ఫార్మ్-8 లను చట్టబద్ధమైన విదానంలో ఈ నెల 26 లోపుగా పరిష్కరించాలని ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదు విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, చివరి నిమిషంలో హడావుడిగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టవద్దని, క్రమ పద్దతిలో వ్యక్తిగతంగా ధాఖలు చేసిన ఫార్మ్-6 లను క్షుణ్ణంగా పరిశీలించిన తదుపరి మాత్రమే నూతన ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుండి ప్రతి రోజూ తొమ్మిది నివేదికలను భారత ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ఈ నివేదికలు పంపే విషయంలో ఏమాత్రం అలక్ష్యం వహించకుండా సకాలంలో నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనపు సీఈవో లు పి.కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్, జాయింట్ సీఈవో వెంకటేశ్వరరావు , డిప్యూటీ సీఈవోలు కె. విశ్వేశ్వరరావు, మల్లిబాబు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్య శిక్షణకు ఎంపికైన ఎస్ జి ఎ కళాశాల విద్యార్థులు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఐ ఫోన్ల తయారీ సంస్థ జీ కే హ్యూమన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం నాడు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 15మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు సంస్థ ముఖ్య కేంద్రం కాంచీపురంలో ఉచిత వసతి భోజన ఏర్పాట్లతో పాటు నెలకు పదహారు వేల రూపాయలను స్టైపెండ్ గా కంపెనీ వారు అందివ్వనున్నట్లు తెలిపారు.అనంతరం విద్యార్థులను ఎంపిక చేసిన జీ కే హ్యూమన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రాజు, సుధాకర్ లను అభినందించారు.ఈ కార్యక్రమంలో జేకేసి కో - ఆర్డినేటర్ కె.వెంకన్న , హిందీ అధ్యాపకురాలు డా.సుధ, జేకేసీ మెంటర్ మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జల దినోత్సవం
## (వరల్డ్ వాటర్ డే)

జలమే జీవనాధారం. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' (వరల్డ్ వాటర్ డే)ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు...

**వరల్డ్ వాటర్ డే...పది ఆసక్తికర విషయాలు..**

1. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు...

2. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల (500 కోట్ల పైమాటే) మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొ నన్నున్నారని అంచనా...

3. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు...

4. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు...

5. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి...


6. 2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా...

7. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది...

8. 2018-2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టైనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది.

9. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి...

10. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా 2,97,000 మంది (సుమారు రోజుకు 800) పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు.



# తల్లికూతుర్ల ధైర్యానికి తోక ముడిచిన దోపిడిదొంగలు

బేగంపేట, : తుపాకీ గురిపెట్టి బెదిరించినా వెరవకుండా తల్లీకుమార్తెలు ప్రదర్శించిన ధైర్యసాహసాలకు దోపిడీ దొంగలు తోకముడిచారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పుర జైన్ కాలనీలో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. నవరతన్ జైన్, ఆయన భార్య అమిత మేహెూత్ రసూల్‌పురలోని హౌసింగ్‌కాలనీలో నివాసముంటున్నారు. గురువారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో అమిత, ఆమె కుమార్తె, పనిమనిషి ఇంట్లో ఉన్న సమయంలో ప్రేమ్‌చంద్, సుశీల్‌కుమార్ కొరియర్ సర్వీసు వచ్చిందంటూ ఇంటి ప్రాంగణంలోకి వచ్చారు. అమిత వారిద్దరినీ తలుపు బయటే ఉండాలని చెప్పగా హెల్మెట్ ధరించిన సుశీల్‌కుమార్ ఒక్కసారిగా ఇంట్లో ప్రవేశించి బ్యాగులోని నాటు తుపాకీ బయటకు తీసి గురిపెట్టాడు. ఆ తర్వాత ప్రేమ్‌చంద్ వంటగదిలోకి వెళ్లి పనిమనిషి మెడపై కత్తి పెట్టాడు. విలువైన వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో అమిత.. సుశీల్‌ను బలంగా కాలుతో నెట్టేసింది. ఈ లోపు ఆమె కుమార్తె కూడా రావడంతో గట్టిగా ప్రతిఘటించారు. ఇద్దరిపైనా సుశీల్ దాడి చేస్తున్నా.. వెరవకుండా గట్టిగా కేకలేస్తూ పట్టుకునేందుకు ప్రయత్నించారు. గత్యంతరం లేక అతడు తుపాకీ వదిలి పరారయ్యాడు. ఈ లోపు తల్లీకుమార్తెల కేకలు విని ఇరుగుపొరుగు వారు చేరుకున్నారు. మరోవైపు ప్రేమ్‌చంద్ కత్తితో బెదిరిస్తూ అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా స్థానికులు వెంటాడి పట్టుకున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులకు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు.. సుశీల్‌ను జీఆర్పీ పోలీసులు కాజీపేటలో అదుపులోకి తీసుకున్నారు. అమిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు పథకం ప్రకారమే ఈ దోపిడీకి యత్నించినట్లు తెలుస్తోంది. ఏడాది క్రితం వీరిద్దరు ఇంటిపని కావాలంటూ అమిత ఇంటికి వచ్చారు. కొంతకాలం పనిచేశారు. ఇంట్లో ఎక్కడెక్కడ ఏయే వస్తువులు ఉంటాయో తెలుసుకుని అకస్మాత్తుగా పని మానేశారు. మళ్లీ గురువారం మధ్యాహ్నం వచ్చి దోపిడీకి విఫలయత్నం చేశారు.

# వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని.. కన్న కుమారుడిని కడతేర్చిన తల్లి



హరికృష్ణ

**బిజినేపల్లి:** వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని కన్నతల్లే కుమారుడిని కడతేర్చిన దారుణ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, రవీందర్ దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు వేర్వేరు ఊర్లలోని హాస్టళ్లలో ఉంటూ.. 9, 7 తరగతులు చదువుతున్నారు. చిన్న కుమారుడు హరికృష్ణ(11) ఇంట్లోనే ఉంటూ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. లక్ష్మికి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీనికి హరికృష్ణ అడ్డుగా ఉన్నాడని ఆమె భావించింది. బుధవారం అర్ధరాత్రి భర్త రవీందర్ పొలం వద్దకు వెళ్లగా హరికృష్ణ తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతడి మృతదేహాన్ని ఇంటి ఆవరణలో ఉన్న నీటి తొట్టిలో వేసింది. నీట మునిగి చనిపోయాడని చుట్టుపక్కల వారిని నమ్మించేందుకు యత్నించింది. తలపై రక్త గాయాలు ఉండటంతో పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. లక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరాన్ని అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# ఘనంగా జల దినోత్సవం నిర్వహణ




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇస్కాఫ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద ప్రపంచ జల దినోత్సవం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ప్రొఫెసర్ బాల మోహన్ దాస్, సోషల్ మీడియా స్టేట్ ఛైర్మన్ సన్ మూర్తి, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజమాణిక్య తదితరులు హాజరై జలాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు 1993 నుంచి జల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తద్వారా నీటి వినియోగాన్ని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. 2040 నాటికి ప్రపంచంలో భూగర్భ జలాలు చాలావరకు తగ్గిపోయే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న తరుణంలో జలాలను సక్రమంగా వినియోగించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మనకు ఉండే నీటి చెరువులు, రిజర్వాయర్ లు, మంచినీటి బావులు వాటిని సక్రమంగా వినియోగించే రీతిలో సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇస్కాఫ్ జాతీయ నాయకులు సుకుమారన్, ప్రభాకర్ నగర నాయకులు రాం ప్రభు నిర్వహణలో వివిధ ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు ఇస్కాఫ్ మహిళా ప్రతినిధులు ఎం మధుమతి, పి సత్యవతి, పావని తదితరులు పాల్గొన్నారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ప్రతినిధి పోలు మహంతి ఉమామహేశ్వరరావు , జ్ఞానానందం, రాజు, అప్పలరాజు, శ్యాంసుందర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని జల సంరక్షణ పై నినాదాలు ఇచ్చారు.

# విశాఖలో డ్రగ్స్.. ఈ ఘటన దేశాన్నే కుదిపేసింది: సాధినేని యామిని



విజయవాడ: విశాఖలో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడిన ఘటన రాష్ట్రాన్నే కాకుండా దేశాన్నే కుదిపేసిందని భాజపా నేత సాధినేని యామినీ శర్మ అన్నారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసులు, నార్కోటిక్స్ విభాగం డ్రగ్స్ సరఫరాను అరికట్టకుండా నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. మాదకద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతోందని.. మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. వీటి వల్లే మహిళలపై నేరాలు, దాడులు పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు.

కూనం వీరభద్రరావుకు చెందిన సంస్థ సంధ్య ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ పేరుతో విశాఖకు కంటెయినర్ వచ్చిందని యామిని అన్నారు. ఆయనకు వైకాపాతో సంబంధాలున్నాయని ఆరోపించారు. అతడి సోదరుడు కూడా ఆ పార్టీ నాయకుడేనని చెప్పారు. ఇదంతా కప్పిపుచ్చుకునేందుకు భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై వైకాపా నేతలు అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఓడిపోతామని తెలిసినా అధికార పార్టీ నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. పురందేశ్వరిపై అసత్య ఆరోపణలు మానుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మాజీ ఎమ్మెల్యే తైనాల ఇంట్లో చోరీ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ నగరంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తైనాల విజయ కుమార్, విజయలక్ష్మి దంపతులు డాబాగార్డెన్స్‌లో నివాసం ఉటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఉద్యోగాల రీత్యా వేరే చోట ఉంటున్నారు. విజయ కుమార్ ఎండాడలో జరిగిన వైకాపా సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఇంటి కొచ్చి భోజనం చేసి వైకాపా విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి ఎస్.కోట వెళ్లారు. రాత్రి 7.20 గంటల సమయంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఇంట్లోకి ప్రవేశించి వంటగదిలో ఉన్న తైనాల భార్య విజయలక్ష్మి కళ్లల్లోకి పెప్పర్‌స్ప్రే కొట్టారు. మెడపై కత్తిపెట్టి, అరిస్తే చంపేస్తానని బెదిరించి మెడలోని పుస్తెలతాడుతో పాటు మరో బంగారు ఆభరణాన్ని తీసుకున్నారు. అనంతరం ఆమె చేత బీరువా తెరిపించి అందులో ఉన్న సుమారు రూ.8లక్షల నగదును తీసుకొని పరారయ్యారు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెంపుడు కుక్క వారం క్రితమే అనారోగ్యంతో చనిపోవడం, ఇంట్లో విజయలక్ష్మి ఒక్కరే ఉండడం చూసి దుండగులు చొరబడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# శ్రీ క్షేత్రం లో ధైర్యలక్ష్మికి పంచామృతభిషేకాలు




**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువైయున్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధైర్యలక్ష్మికి పంచామృత అభిషేకాలు చేశారు . శుక్రవారం ఉదయం దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ అచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ అచార్యులు సంయుక్తంగా వేదమంత్రాలు నడుమ ధైర్యలక్ష్మికి అర్చన ,పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు .ఈ కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ,ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి... మీరు గర్వ పడే విధముగా విశాఖ ఉత్తర నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల ప్రచారంలో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గం 49,50 వార్డు పరిధిలో మురళి నగర్ వాకర్స్ పార్కు, సుదర్శన్ పార్క్ ప్రశాంతి పార్కులను వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు వార్డు కార్పొరేటర్లు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్ రావు, వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈమేరకు పార్కుకి వచ్చిన పలువురు వాకర్స్ తో కొంతసేపు ముచ్చటించారు.రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.వాకర్స్ తామంతా మీకు మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భగతి విజయ్ కుమార్, కృష్ణారావు మాస్టర్ అమర్ రెడ్డి, మరియు పార్టీ శ్రేణులు, యువజన విభాగం నాయకులు సీనియర్ నాయకులు, అభిమానులు అందరితో కలిసి పర్యటించారు.

# ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం (మార్చి 23)




ఈ రోజు వాతావరణ శాస్త్రవేత్తలకు చాలా ప్రత్యేకమైన రోజు: ఇది ప్రపంచ వాతావరణ దినోత్సవం. తీవ్రమైన వాతావరణ దృగ్విషయం నుండి జనాభాను రక్షించే ముందస్తు హెచ్చరికల వ్యాప్తిలో శాస్రవేత్తలు చేసిన కృషి జ్ఞాపకం ఈ రోజు . ఈ నిపుణులు లేకపోతే, మానవ ప్రాణనష్టం ఈనాటి కన్నా చాలా ఎక్కువ. ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 23న నిర్వహించబడుతుంది. ప్రకృతి సహజ అవసాలపై వాతావరణ మార్పులు చూపే ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కలిగించడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు. సమాజపు భద్రత, శ్రేయస్సు కోసం జాతీయ వాతావరణ, జల సేవలు అందించే సహకారం గురించి ఈరోజు గుర్తుచేసుకుంటారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950, మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థ ప్రారంభించబడింది. ఆ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవంగా నిర్ణయించబడింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుపబడుతుంది. వాతావరణ శాఖ నిపుణుల ఆధ్వర్యంలో ప్రజలకోసం అవగాహన సమావేశాలు, ఛాయాచిత్ర ప్రదర్శనలు జరుగుతాయి. వాతావరణ పరిశోధన చేసిన వాళ్ళకు ఈ దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ వాతావరణ సంస్థ బహుమతి, ప్రొఫెసర్ డాక్టర్ విల్హో వైసెల్ అవార్డు, ది నార్బర్ట్ గెర్బియర్-మమ్ అంతర్జాతీయ అవార్డు లు బహుమతులు అందజేయబడుతాయి. ఈ దినోత్సవాన్ని జరుపుకోవడానికి చాలా దేశాలు తపాలా బిళ్ళలను, ప్రత్యేక తపాలా స్టాంపు గుర్తులను విడుదల చేస్తాయి.. అర్థ శతాబ్దం క్రితం, 1950 లో ఈ రోజు లాంటి రోజున ప్రపంచ వాతావరణ సంస్థ సృష్టించబడింది తీవ్రమైన వాతావరణ విషయాలపై హెచ్చరికలను వ్యాప్తి చేయడానికి 30 సభ్య దేశాలు మరియు భూభాగాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. వాతావరణం మరియు భూమి మరియు మహాసముద్రాలతో వారి పరస్పర చర్యలపై అధికారిక సమాచారాన్ని అందించడానికి ఐక్యరాజ్యసమితి అధికారం కలిగిన ఏకైక ఏజెన్సీ ఇది.

డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్
9490833108.

రండి! దర్శించండి!! తరించండి!!!
శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరం
మొగిలిచెర్ల - నెల్లూరు జిల్లా



తేది : 25 - 03- 2024 సోమవారం పాల్గుణ మాస పౌర్ణమి సంధర్భంగా
మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత
మహా మృత్యుంజయ హోమము
నిర్వహిస్తున్నాము.
ఈ హోమము నందు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనదలచిన భక్తులు మరిన్ని వివరాలకు క్రింది సెల్ నెంబర్లను సంప్రదించగలరు.
99 08 97 36 99 99 49 74 28 65
63 02 61 68 97
గమనిక : ప్రత్యక్షంగా పాల్గొనదలచిన భక్తులు 25-03-2024 న ఉదయం 8 గంటలకు మందిరము వద్దకు చేర ప్రార్థన.

## రూ.లక్ష అంతకు మించి బ్యాంకు లావాదేవీలపై నిఘా పెట్టాలని రాష్ట్రాలకు ఈసీ లేఖ



ఎన్నికలపై డబ్బు ప్రభావాన్ని కట్టడి చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాలకు కీలక సూచనలు చేసింది. బ్యాంకుల నుంచి రూ.లక్ష అంతకు మించి చేపట్టిన లావాదేవీలపై నిఘా పెట్టాలని రాష్ట్రాలకు ఈసీ లేఖ రాసింది. బ్యాంకు ఖాతాల నుంచి ఉపసంహరణ, డిపాజిట్ చేసినా అందుకు సంబంధించిన వివరాలను ఆరా తీయాలని సూచించింది. దేశవ్యాప్తంగా లోక్‌సభతో పాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మేరకు లేఖ రాసింది.

"రూ. లక్ష అంతకుమించి నిర్వహించే లావాదేవీల వివరాలను అన్ని బ్యాంకుల నుంచి జిల్లా ఎన్నికల అధికారులు తెప్పించుకోవాలి. వాటిని విశ్లేషించే బాధ్యతను సంబంధిత సిబ్బందికి అప్పగించాలి. ఎన్నికల సమయంలో ఒకే బ్యాంకు బ్రాంచి నుంచి వేర్వేరు ఖాతాలకు సొమ్మును బదిలీ చేస్తున్న దాఖలాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఓటర్లను ప్రభావితం చేసేందుకు వివిధ మార్గాల ద్వారా నగదు లావాదేవీలు చేపట్టే అవకాశం ఉంది. రాజకీయ పార్టీల ఖాతాల నుంచి చేపట్టే లావాదేవీలపై నిఘా పెట్టాలి.

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి, ఆయన భార్య, అభ్యర్థిపై ఆధారపడిన వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ. లక్షకు మించి నిర్వహించే లావాదేవీలను అఫిడవిట్‌లో నమోదు చేయాలి. ఆ వివరాలను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారుల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలి. ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి రెండు నెలల ముందు నుంచి జరిగిన లావాదేవీలను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేయాలి. రూ. 10 లక్షలకు మించి నగదు విత్‌డ్రా లేదా జమపై తప్పనిసరిగా నిఘా పెట్టాలి. ఆయా వివరాలను ఆదాయ పన్నుశాఖ నోడల్ అధికారులకు అందజేయాలి" అని ఈసీ రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

## ఆడబిడ్డను ప్రసవించి.. చేనులో విసిరేసి

**భీమిని:** ఓ తల్లి అప్పుడే ప్రసవించిన బిడ్డను చేనులో పడేసి కుక్కలపాలు చేసిన అమానవీయ ఘటన మంచిర్యాల జిల్లా భీమిని మండలం కేస్లాపూర్ గ్రామంలో వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కేస్లాపూర్‌కు చెందిన ఓ మహిళ(45) 8 నెలల గర్భిణి కాగా గ్రామ శివారులోని చేనులో ఆడశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం ఆ బిడ్డను అక్కడే పడేసి వెళ్లిపోయింది. గురువారం మధ్యాహ్నం శునకాలు సుమారు అర కి.మీ. దూరంలోని మరో చేనులోకి శిశువును లాక్కెళ్లి పీక్కుతింటుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకునేలోగా శిశువును అవి సగం వరకు తినేశాయి. ఈ మేరకు పోలీసులు సదరు మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతశిశువును పడేశారా..? బతికుండగానే పడేశారా..? అనే దానిపై ఆరా తీస్తున్నారు. ప్రసవ సమయంలో ఓ ఆర్‌ఎంపీ సహాయం అందించినట్లు సమాచారం. ఆశా కార్యకర్త రికార్డుల్లోనూ ఆమె గర్భిణిగా నమోదు చేసుకోలేదు.

## రూ.5.4 కోట్లు కొట్టేసిన నకిలీ పోలీసులు

### మహారాష్ట్రలో ఘటన

**థాణె:** పోలీసుల మాదిరిగా నటించిన ఎనిమిది మంది వ్యక్తులు ఓ కొరియర్ సంస్థకు చెందిన రూ.5.4 కోట్లు దోచేసిన ఘటన మహారాష్ట్రలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై థాణె పోలీసులు కేసు నమోదు చేసినట్లు గురువారం ఓ అధికార ప్రకటన వెల్లడించింది. ఈ నెల 14-15 రాత్రి ఓ కొరియర్ సంస్థకు చెందిన కారు జలగావ్ నుంచి ముంబయికి బయలుదేరింది. ఎనిమిది మంది సభ్యులు గల ఓ ఇన్నోవా వాహనం ఆ కారును అడ్డగించింది. పోలీసుల మాదిరిగా వ్యవహరించిన నిందితుల్లో కొందరు కారులోకి బలవంతంగా చొరబడ్డారు. కారును కొంత దూరం తీసుకుపోయి రహదారికి దూరంగా ఆపారు. వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు నటించి రూ.5.4 కోట్లు గల రెండు గోనె సంచులను ఎత్తుకుని పారిపోయారు.

## ఆ చిన్నారి సోదరుల దేహాలపై 24 కత్తిపోట్లు

బదాయూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో సంచలనం రేకెత్తించిన చిన్నారి సోదరుల హత్య కేసులో గురువారం మరికొన్ని వివరాలు వెలుగుచూశాయి. మృతుల్లో ఆయుష్ శరీరంపై 13, అహన్‌కు 11 కత్తిపోట్లు ఉన్నట్లు శవపరీక్షలు నిర్వహించిన వైద్యులు గుర్తించారు. మెడ, వీపు, ఛాతీ, కాళ్లపై దాడి జరిగినట్లు వారు తెలిపారు. పొరుగు జిల్లా-బరేలీలోని పోలీసుల వద్దకు ప్రధాన నిందితుడు సాజిద్ తమ్ముడు జావేద్ నేరుగా వచ్చి లొంగిపోయాడు. తనకు ఈ ఘాతుకంతో ఎలాంటి సంబంధం లేదని, హత్యల విషయం తెలిసిన తర్వాతే వచ్చానని వీడియో సందేశంలో తెలిపాడు. ప్రజాగ్రహానికి భయపడి దిల్లీ పారిపోయినట్లు చెప్పాడు. పోలీసు కాల్పుల్లో సాజిద్ చనిపోగా అతని తండ్రి, సోదరులను ప్రశ్నిస్తున్నారు. హత్యలపై మెజిస్టీరియల్ విచారణకు బదాయూ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సాజిద్, జావేద్ కలిసే హత్యలకు పాల్పడ్డారని చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# నీరు ఉంది కాబట్టే భూమి మీద జీవం ఉంది



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): నీరు ఉంది కాబట్టే భూమి మీద జీవం ఉంది, అందుకే మనం జలవనరులను కాపాడుకోవాలని ఎయు సైన్స్ కాలేజీ. ప్రిన్స్ పాల్ కె శ్రీనివాసరావు అన్నారు . ఈ మేరకు గురువారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో సిఫా ట్రస్ట్, సైకాలజీ విభాగం సంయుక్తంగా జలవనరుల రోజు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఒక గంట రాత్రి 8.30 నుండి 9.30 వరకూ విద్యుత్తు ఆపి ధరిత్రి గంటను జయప్రదం చేయండని కోరారు. భూగోళం మీద నీటి వనరులలో 99 శాతం ఉప్పు నీరే. ఇందులో 97 శాతం సముద్రాల్లో ఉండగా, మిగితాది నదులు, చెరువుల్లో ఉందన్నారు. తాగడానికి ఉపయోగ పడే జలాలు కేవలం ఒక శాతం మాత్రమే ఉన్నాయి. అందులో 0.86 శాతం చెరువులు,0.02 శాతం నదుల్లో, మిగితా0.12 శాతం భూగర్భ జలాలు. అంటే ప్రపంచ వ్యాప్తంగా కేవలం 0.3శాతం ఉపయోగపడే నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ వనరులే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్ల మంది దాహాన్ని, ఇతర అవసరాలను తీరుస్తున్నాయన్నారు.

ఎన్విరాన్మెంట్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ఎ.జె.సాల్మన్ రాజు మాట్లాడుతూ జల వనరులు కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళి మీద ఉందన్నారు. జలమే జీవనాధారం అనే అంశం ప్రతి ఒక్కరూ గుర్తించాలి, పెరుగుతున్న జనాభా కు భవిష్యత్తులో నీటి లభ్యత ఎలా అన్నది అర్థం చేసుకోవాలి అని వివరించారు. జలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రకృతి వనరులను కాపాడేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

అకడమిక్ స్టాఫ్ కాలేజ్ గౌరవ ప్రొఫెసర్ ఎస్ ఎ డి పాల్ మాట్లాడుతూ భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటివనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి న్నారు. మానవ చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది అని వివరించారు. జీవం నీటితో మొదలైంది. ప్రకృతి నీటితోనే నడుస్తోంది. అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు కావాలన్నారు జీవవైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యం అవుతుంది కాబట్టి జలవనరులను కాపాడుకోవాలని కోరారు.

సైకాలజీ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఎం వి ఆర్ రాజు మాట్లాడుతూ నీటిని వృధా చేస్తూ కలుషితం చేసి విషతుల్యంగా మార్చేస్తున్నామని విచారం వ్యక్తం చేశారు. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే, ఉన్న నీటిని వృధా చేయడం బాధాకరమని అన్నారు. నీటి వనరులను వ్యర్థాలతో కలుషితం చేసి తాగడానికి వీల్లేని విధంగా తయారు చేస్తున్నామని విచారం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, సిఫా ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ శశిప్రభ, సంస్థ ప్రతినిధులు రామలక్ష్మి, ప్రసాద్ లు, వైఆర్ జి కేర్ సంస్థ ప్రతినిధి సుబ్బలక్ష్మి తదితరులు మాట్లాడారు.

## జైపుర్‌లో వంట గ్యాస్ లీకు.. అయిదుగురి సజీవ దహనం

**జైపుర్:** వంట గ్యాస్ లీకై ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు వ్యక్తులు దుర్మరణం పాలైన ఘటన రాజస్థాన్‌లో చోటు చేసుకుంది. జైపుర్‌లోని విశ్వకర్మ పోలీసు స్టేషన్ పరిధిలోని రాజేశ్ యాదవ్ (25) భార్య ముగ్గురు పిల్లలతో కలిసి ఓ అద్దె గదిలో నివసిస్తున్నారు. గురువారం ఉదయం ఎల్పీజీ సిలిండర్‌ను మారుస్తుండగా గదంతా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ ప్రమాద సమయానికి అదే గదిలో ఉన్న రాజేశ్ సహా ఆయన భార్య రూబీ(24), కుమార్తెలు ఇషు (7), ఖుషమణి (4), కుమారుడు దిల్‌కుష్ (2) సజీవ దహనమయ్యారు. బిహార్‌లోని మోతిహారికి చెందిన రాజేశ్ నాలుగు నెలల క్రితమే బతుకుతెరువు కోసం జైపుర్ వచ్చి అక్కడ ఓ కర్మాగారంలో పనిచేస్తున్నాడని పోలీసులు వెల్లడించారు. అగ్నిమాపక దళం మంటలను అదుపు చేయగా మృతుల శరీరాలను స్థానిక ఆసుపత్రి శవాగారానికి తరలించారు.

## కె.కె రాజుకి అభినందనలు తెలియజేసిన చొక్కాకుల వెంకటరావు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజుని ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన చొక్కాకుల వెంకటరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛము అందజసి సాలువాతో సత్కరించారు. అనంతరం కె.కె రాజు చొక్కాకుల వెంకటరావుని సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం శక్తివంతం లేకుండా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో 14వార్డు కార్పొరేటర్ కె అనిల్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# లక్షల కాపీలు అమ్ముడుపోయిన THE SKY GETS DARK SLOWLY

"The Sky Gets Dark Slowly" అనే పుస్తకం ఈ పుస్తకం నేను చదవలేదు కానీ గూగుల్‌లో దీని సారంశం.

'వృద్ధాప్యంలో డబ్బు అవసరం' గురించి ప్రస్తావిస్తూ ఆ సారాంశాన్ని ప్రస్తావించారు. నువ్వు వెల్లకిలా పడుకొని ఆకాశం వైపు చూస్తూ ఉంటావు. గగనంలో నక్షత్రాలు ఒక్కొక్కటిగా మాయమైపోతూ ఉంటాయి.

నిన్ను 'అరే, ఒరేయ్' అని పిలిచే స్నేహితులొక్కొక్కరూ రాలిపోతూ ఉంటారు.

నీ ముందు నిక్కర్లేసుకుని తిరిగిన పిల్లలందరూ ఇప్పుడు యుక్త వయస్సులోకి వచ్చి నీ చుట్టూ చాలా హడావిడిగా తిరుగుతూ ఉంటారు.

నీతో మాట్లాడే సమయం కూడా వారికి ఉండదు.

నీ మీద స్పాట్‌లైట్ ప్రసరించటం మానేసి చాలా కాలం అయిపోయి ఉంటుంది. నీ జీవితంలో నువ్వు ఎన్నో సాధించి ఉండవచ్చు. నీ కీర్తి నాలుగు దిక్కులా ప్రసరించి ఉండొచ్చు.

కానీ ప్రస్తుతం దాన్ని ఎవరూ గుర్తించరు. ఈ సొసైటీ నీ గురించి పట్టించుకోవటం మానేసి చాలా కాలం అయివుంటుంది.

దాహంతో దూరంగా ఎక్కడో ఒక కాకి అరుస్తూ ఉంటుంది. నీ లాంటి వృద్ధుడు ఎవరో నీకు అప్పుడప్పుడు ఫోన్ చేసి ఇంట్లో తన అవస్థ చెప్పుకుంటూ ఉంటాడు.

నీ అమూల్య అభిప్రాయాల్ని చెప్పటానికి ఒక శ్రోత ఈ ప్రపంచంలో దొరికిన సంతోషం నిన్ను తబ్బిబ్బు చేస్తుంది.

యవ్వనంలో హెల్త్ ఇన్సూరెన్స్ మానేసి ఆ డబ్బు పిల్లల కాలేజీ ఫీజు కట్టావు.

మధ్య వయసులో సంపాదించినది పిల్లల్ని అమెరికా పంపించడానికి ఖర్చు పెట్టావు.అందరితో "నా కొడుకు అమెరికాలో కూతురు ఆస్ట్రేలియాలో ఉన్నది" అని గర్వంగా చెప్తూ ఉంటావు.

"ఎన్నేళ్ళకు ఒకసారి వాళ్ళు నిన్ను చూడటానికి వచ్చారన్నది" మాత్రం చెప్పవు.

అమెరికా నుంచి పిల్లలు సెల్ ఫోన్ లో నీ పుట్టినరోజు తేదీ చూసి ఫోన్ చేస్తారు. నీకు నీ మనవడితో మాట్లాడాలని ఉంటుంది. కానీ వాడు చాలా బిజీ.

అర్థరాత్రి ఏ నొప్పితోనో నీకు మెలకువ వస్తుంది. "పక్కగదిలోని వారికి నిద్రాభంగం చేయాలా వద్దా..?" అన్న ఆలోచనతోనే తెల్లవారుతుంది.

పక్క మీద గంటల, రోజుల తరబడి పడుకొని ఉండటం సాధారణం అవుతుంది.

"పుట్టిన కొత్తలో పక్క మీద శిశువు నెలల తరబడి కదలకుండా ఎలా ఉంటుందో తిరిగి అదే స్థితి" సంభవిస్తుంది. ఒకటే తేడా ఏమిటంటే చిన్నప్పుడు ఆలనాపాలనా చూసుకోవటానికి తల్లి ఉంది.

ఇప్పుడెవరూ లేరు. అప్పుడప్పుడూ వచ్చి పలకరించే కూతురూ, తప్పదన్నట్టు సేవలు చేసే కోడలూ. నీ అదృష్టం బాగా లేకపోతే అనాథాశ్రమంలో వారు కూడా ఉండరు.

నువ్వు కొద్దిగా ఎక్కువ తిన్నా.., అసలు తినకపోయినా మెడిసిన్ చదివిన డాక్టర్లలాగా నీ పిల్లలు నీకు సలహాలు ఇస్తూ ఉంటారు. ఒళ్ళు వెచ్చబడితే చలిలో ఎందుకు తిరిగావనీ.., జలుబు చేస్తే చన్నీళ్ళ స్నానం ఎందుకు చేశావనీ.., కాళ్ళు నొప్పులు పెడితే గుడికి ఎందుకు వెళ్ళావనీ నిన్ను మందలిస్తూ ఉంటారు.

ప్రొద్దున్న లేచేసరికి అకస్మాత్తుగా ఏ జలుబో, కీళ్ళ నొప్పులో ప్రారంభం అవుతాయి. బాత్‌రూంలో పడటం, కాళ్ళు విరగటం, జ్ఞాపకశక్తి నశించటం, ఆసుపత్రికి వెళ్ళినప్పుడు డాక్టర్ చాలా క్యాజువల్‌గా 'నీకు కాన్సర్' అని చెప్పటం మొదలైనవి అన్నీ నీ జీవితంలో భాగమైపోతాయి.

నీది మరీ మధ్యతరగతి కుటుంబం అయితే..,

నువ్వు సంపాదించిన డబ్బే..! అయినా "నీ ఆసుపత్రి ఖర్చుల కోసం ఖర్చు పెట్టాలా చూసీ చూడనట్టు నీ మరణం కోసం వేచి ఉండాలా..?" అన్న ఆలోచనతో నీ పక్క గదిలో నీ వాళ్ళు చర్చిస్తూ ఉంటారు.

**మరేం చెయ్యాలి?**

THE SKY GETS DARK SLOWLY అనే పుస్తకంలో రచయిత "ప్రస్తుత జీవన విధానం మార్చుకుంటేపై సమస్యల్లో "కనీసం కొన్ని తగ్గించుకోవచ్చు" అంటాడు.

"ఆకాశం క్రమక్రమంగా నల్లబారుతోందనీ, ఒక్కొక్క దీపమే ఆరిపోతుందనీ గ్రహించిన వ్యక్తి జీవితపు ఆఖరి స్టేజి కోసం ఆరోగ్యవంతంగా ప్రిపేర్ అవ్వాలంటే అయిదు సూత్రాలు గుర్తుంచుకోవాలి" అంటాడు.

ఆకాశం పూర్తిగా నల్లబడక ముందే నీ దారి పొడుగునా లైట్లు వెలిగించి శక్తి ఉన్నంతవరకూ పని చేస్తూ ఉండు.

నీకన్నా అశక్తులకీ, అనాథలకీ సహాయం చేస్తూ ఉండు.

ఏకాంతం స్థానే శూన్యత ప్రవేశించినప్పుడు అది "అతి తొందరలో ఒంటరితనంగా" మారుతుందన్న విషయాన్ని నువ్వు ఎంత తొందరగా తెలుసుకుంటే అంత బాగుంటుంది.

ప్రతి మనిషి చుట్టూ ఒక "తావి" ఉంటుంది... వయసు పెరిగే కొద్దీ అది "సుగంధ సౌరభ పరిమళంగానో.., దుర్గంధ పూరితంగానో" మారుతుంది.

ఎలా మారుతుందనేది "నీ హుందాతనాల / నీ చాదస్త ప్రవర్తన" మీద ఆధారపడి ఉంటుంది.

పిల్లలు పుట్టగానే లావు అవటం సహజం అనుకోకు. జిహ్వ చాపల్యం తగ్గించు..! ఒక "వయసు వచ్చాక తిండి ఆనందం కాదు. అవసరం".

వయసు పెరిగే కొద్దీ శరీరం ఇచ్చే సంకేతాలు గమనించు.

వయసు వల్ల వచ్చిన అధికారంతో నీ చుట్టూ ఉన్నవాళ్ళని శాసించకు. వీలైనంత వరకూ వారి చర్యలపై నీ అమూల్యాభిప్రాయాన్ని వెల్లడి చేయకు.

నీ బోధనలు ఆపి ఒక్కడివే ఉండటం ఎలాగో నేర్చుకో. లేకపోతే నీ ఇంటివారు నిన్ను మరింత దూరం పెడతారు.

ఒంటరిగా కూర్చొని పుస్తకాలు చదువు.??

ఏకాంతంలో మంచి పాటలు వింటూ ఆనందించు... శాస్త్రీయ సంగీతాన్ని విను.

ఓపికుంటే మొక్కల్ని పరిరక్షించు.

ఎదుటి వారి లోపాలను వెతికే నీ దరిద్రపు ఆలోచనలు మర్చిపో..

అన్ని నాకే తెలుసు అనే అహంకారం వదులుకో..

నీవు ఎంత పెద్ద ఉద్యోగం వెలగబట్టినా చిన్న ఉద్యోగి స్వీపర్ తో సమానంగా ఆన్లైన్ లో కంప్యూటర్ ముందు నీ పెన్షన్ పి.పి.నెంబర్ చెప్పుకోవాల్సిందేనని గుర్తుంచుకో..?

చిన్న పిల్లలతో కొద్ది సేపు "వారికి ఇంటరెస్టు ఉన్న టాపిక్స్" కబుర్లు చెప్పు.

అఫెక్షన్ బ్యాంక్ లో ఆప్యాయతని క్రెడిట్ చేసుకుంటూ వెళ్ళు.

# మొగలిచెర్ల అవధూత శ్రీ దత్తాత్రేయ స్వామివారితో అనుభవాలు..

**గోశాల..**

"శ్రీ స్వామివారి మందిరం వద్ద ..ఆ స్వామి కృపతో అన్నదానం జరుగుతున్నది..స్వామివారిని దర్శించుకున్న భక్తుల కోరికలు కూడా తీరుతున్నాయి..అన్నీ లక్షణంగా ఉన్నాయి..ఒక్క గోశాల కూడా వుంటే బాగుంటుంది..కనీసం ఐదు ఆవులను మన గుడి వద్ద పోషిస్తే బాగుంటుంది.."అని 2016 ఆగస్ట్ లో మా సిబ్బంది నాతో చెప్పారు.. చూద్దాం..అంటూ వాయిదా వేసాను నేను..అందుకు కారణం లేక పోలేదు..గోశాల నిర్వహణ తేలికైన పని కాదు..గోవులకు సరైన ఆహారం..వాటిని సంరక్షించడానికి పని వాళ్ళూ..ఉంచడానికి ఒక గోశాల కావాలి..ఇవన్నీ ఖర్చు తో కూడుకున్న పనులు..శ్రీ స్వామివారి వద్ద గోవులను ఇవ్వడానికి కొంతమంది ఉత్సాహం చూపుతున్నారు.. కానీ.. నేను వారిస్తూ వున్నాను..అన్ని ఏర్పాట్లూ చేసి..ఆపైన గోవులను ఇక్కడికి తీసుకురావాలని నా కోరిక..

క్రమంగా మా వాళ్ళ నుంచి గోశాల గురించిన అభ్యర్థన పదే పదే వినబడసాగింది..నేనూ నిశ్చయానికి వచ్చేసాను..ముందుగా ఒక పది పదిహేను గోవులు ఉండడానికి సరిపడా షెడ్ నిర్మాణం జరగాలి..కనీసం రెండు, రెండున్నర లక్షల వ్యయం అవుతుంది..దాతల సహకారం తీసుకుందామని నిర్ణయించుకున్నాము..ఏ నిర్ణయమైనా అమలు చేద్దామని అనుకున్నప్పుడు..ముందుగా శ్రీ స్వామివారి సమాధి వద్ద మోకరిల్లి..అక్కడ చెప్పుకొని.. మొదలు పెట్టడం అలవాటు..ఇప్పుడు కూడా శ్రీ స్వామివారి సమాధి వద్ద ఇలా గోశాల నిర్మాణం చేయాలని సంకల్పించామనీ..ఆశీర్వదించమని వేడుకున్నాను..

ఆ ప్రక్క ఆదివారం రోజు..వింజమూరు నుంచి..శ్రీ గుఱ్ఱం వెంకటేశ్వర్లు దంపత్సమేతంగా వచ్చారు..శ్రీ స్వామివారి ఆశ్రమాన్ని నిర్మించిన శ్రీ బొగ్గవరపు చిన మీరాశెట్టి గారికి స్వయానా మరదలి కుమారుడు..1979 నుంచీ నాకు పరిచయం ఉన్న వ్యక్తి..శ్రీ స్వామివారి మీద అత్యంత భక్తి శ్రద్ధలు కలిగిన వాడు..శ్రీ స్వామివారి సమాధి దర్శనం చేసుకొని..ఉత్సవ విగ్రహం వద్ద పూజ చేయించుకొని..నేరుగా నావద్దకు వచ్చి..ఏ ఉపోద్ఘాతమూ లేకుండానే..నేరుగా..

"మన గుడి వద్ద గోశాల లేదు కదా?..గోశాల ఎందుకు కట్టించలేదు?..ఇంత పెద్ద ఆలయం వద్ద గోశాల కూడా వుంటే ఎంత శోభస్కరంగా ఉంటుందో ఆలోచించావా?..నా మాట విని తొందరగా గోశాల ఏర్పాటు చెయ్యి.." అని గబ గబా చెప్పేసాడు..

నేను కొద్దిగా తేరుకొని.."గోశాల నిర్మించాలంటే..నిధులు కావాలి కదా?..సుమారు రెండులక్షల పైమాటే..గబుక్కున నేను ఒకరిని అడగలేను..గోశాల గురించి ఆలోచన చేసాను..ఆ స్వామివారితో కూడా మొర పెట్టుకున్నాను..దాతల సహకారం తీసుకొని..మెల్లిగా పూర్తి చేస్తాను..అదీకాక గోవులకు గ్రాసం కొనడం పెద్ద సమస్య ఇక్కడ..మొగలిచెర్ల లో గ్రాసం దొరకదు..వేరే గ్రామాల నుంచి గడ్డి కొని..ట్రాక్టర్ ద్వారా తెప్పించుకోవాలి..ఇవన్నీ ఆలోచించుకోవాలి కదా.." అన్నాను..

"ముందు ఒకటి చెప్పు ప్రసాదూ..గోశాల నిర్మాణం జరగడం నీకు అభ్యంతరం లేదు కదా..ఇక ఆ ఖర్చు గురించి..రెండు..రెండున్నర లక్షలు కదా..ఇంకొంచెం ఎక్కువైనా పర్లేదు..వచ్చేనెలలో మంచిరోజు ఎప్పుడో చూడు..నిర్మాణం మొదలుపెడదాం..నేను పూర్తిగా ఆ ఖర్చు భరిస్తాను..రెండు మూడు నెలలకు సరిపడా గడ్డి కూడా నేనే ఏర్పాటు చేస్తాను..ఇక నీదే ఆలస్యం.." అన్నాడు..

నేను మాట్లాడటానికి ఏమీ లేదు..శ్రీ స్వామివారే వెంకటేశ్వర్లు ద్వారా చెప్పించేసారని అర్థమైపోయింది..సరే అన్నాను..మరో వారం రోజులకల్లా వెంకటేశ్వర్లు తన మనుషులను పంపించాడు..వాళ్ళు చక చకా గోశాల కు అనువైన షెడ్డును నిర్మించేశారు..మరో రెండు నెలల లోపే ఐదు గోవులతో..గోశాల ప్రారంభం అయింది..అందులో రెండు గోవులు వెంకటేశ్వర్లు ద్వారా వచ్చినవే..ఈరోజు మొత్తం పన్నెండు ఆవులతో మేము గోశాల ను నిర్వహిస్తున్నామంటే..పైకి కనిపించే కారణం శ్రీ గుఱ్ఱం వెంకటేశ్వర్లు ప్రోద్బలమూ..ఆర్థికసహాయమూ..కానీ అంతర్లీనంగా మాకు కనిపించేది ఆ దయామయుడైన అవధూత శ్రీ దత్తాత్రేయుడి సంకల్పం..అది నెరవేర్చే బాధ్యత కూడా శ్రీ స్వామివారిదే.. మేము నిమిత్తమాత్రులం..

# సమిష్టి కృషితో విజయం తథ్యం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మన అందరి సమిష్టి కృషితో విశాఖ ఉత్తర నియోజకవర్గం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం తధ్యమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కె కె రాజు అన్నారు. ఈ మేరకు విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో పలువురు కె కె రాజుని అభినందించారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ మనందరి సమిష్టికి వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి గిఫ్టుగా అందిద్దామని కావున అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు మరియు ది వైజాగ్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ సభ్యులు పలు సంఘాల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 84వ వార్డులో కొణతాల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక 84 వార్డు ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో కోట్ని వీధిలో టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి అయిన కొణతాల రామకృష్ణ కు మద్దతుగా గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి రామకృష్ణ ను అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిందిగా ప్రజల్ని కోరారు. జగన్ రెడ్డి నియంత పాలన పోవాలంటే టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అవ్వాలని ప్రజలకి ఈ దుష్టపాలన నుంచి విముక్తి కావాలని ప్రజలకు ఇంటింట ప్రచారంలో నీల బాబు అన్నారు. తెలుగుదేశం, జనసేన సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని, లబ్ది చేకూరాలంటే ఉమ్మడి పార్టీ గుర్తు గ్లాస్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తరపున అనకాపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, కోట్ని రాంబాబు, తలారి లక్ష్మీప్రసాద్, డొంక దుర్గ నాయుడు, మాజీ కౌన్సిలర్ కరణం శ్రీనివాసరావు, కొణతాల కృష్ణ, మామిడి రాధాకృష్ణ, జనసేన కార్యకర్తలు దుడ్డు నాగేశ్వరరావు, కోట్ని హరి, మజ్జి శ్రీనివాసరావు, సాలపు శ్రీను, ప్రసాద్ల రవి, నాగిరెడ్డి మధు, అధిక సంఖ్యలో నాయకులు మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ రమణ మూర్తితో ఎమ్మెల్యే వాసుపల్లి బేటీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ రమణ మూర్తితో శుక్రవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆసుపత్రిలో కాసేపు భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రమణ మూర్తి సహకారం కోరుతూ కలిశారు. గౌరవంగా సత్కరించి పార్టీ విషయాలు, ప్రస్తుతం దక్షిణంలో వైసీపీకి వస్తున్న మెజార్టీ, ప్రజల ఆదరణ అంశాల పట్ల మాట్లాడుకున్నారు. దక్షిణంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తిరుగు లేదని, స్థానిక నేతల సపోర్టు, ప్రజల ఆదరణ తో అత్యధిక మెజార్టీతో గెలుస్తారని రమణమూర్తి జోష్యం చెప్పారు. మీ ఆశీర్వచనాలు తప్పకుండా కావాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల వైసిపి అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘనల పై కేసులు

**విజయనగరం:** ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారి పై కేసులను నమోదు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో శుక్రవారం వరకు 12 ఉల్లంఘన కేసులను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో ఎస్.కోట నియోజకవర్గానికి చెందినవి 3 కేసులు, రాజాం నియోజకవర్గానికి చెందినవి రెండు కేసులు, నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందినవి 2 కేసులు , చీపురుపల్లి, బొబ్బిలి నియోజకవర్గాలకు చెందినవి ఒక్కొక్కటి కాగా విజయనగరం నియోజకవర్గానికి చెందినవి 3 కేసులను పోలీస్ లు నమోదు చేసినట్లు తెలిపారు. వీటిలో అనుమతులు లేకుండా ప్రచారం చేపట్టినవి, ఓటర్ల ను ప్రలోభ పెట్టేలా వస్తు పంపిణీలు, మద్యం బాటిళ్ళు అక్రమ నిల్వలు, కొత్తగా పనులు ప్రారంభించినందుకు, గరివిడి, ఎస్.కోట మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు వాలంటీర్ల పై ఉల్లంఘనలకు సంబంధించి కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.

# తైనాలను పరామర్శించిన ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మాజీ ఎమ్మెల్యే వైసీపీ సీనియర్ నాయకులు తైనాల విజయ్ కుమార్ ను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

గురువారం సాయంత్రం ఆయన నివాసంలో జరిగిన దొంగతనం ఘటనను చింతిస్తూ సానుభూతి తెలియజేశారు. జరిగిన ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాసేపు ఆయనతో చర్చించారు. ఇకపై మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. తైనాల సతీమణి ఆరోగ్యం అడిగి తెలుసుకున్నారు. ఆమెకు ధైర్యం చెప్పాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే, నగరం నడిబొడ్డులో ఉన్న ఇంటికి సాయంత్రమే రక్షణ లేకపోవడం పట్ల అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే పోలీసులు విచారణ జరిపి నిందితులను నుండి పోయిన సొత్తు ను రికవరీ చేసి ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాసుపల్లి గణేష్ కుమార్ తో పాటు పలు వైసిపి నాయకులు, సీనియర్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటా

### వైసీపీలో చేరిన జనసేన, టిడిపి కార్యకర్తలకు భరత్ హామీ





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** కశింకోట మండలం సుందరయ్య పేటలో గల కోడూరుగ్రామం, ఎల్.కొత్తూరు, చరకాం, గ్రామాల నుండి టిడిపి, జనసేన కార్యకర్తలు సుమారు 60 మంది అనకాపల్లి వైయస్సార్ సిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సమక్షంలో వైసిపి లో చేరారు. స్థానిక రింగ్ రోడ్ లో ఉన్న వైసిపి కార్యాలయంలో శుక్రవారం జరిగింది కార్యక్రమంలో పార్టీలో చేరిన జనసేన తెలుగుదేశం కార్యకర్తలకు కండువా వేసి భరత్ వైసీపీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ యువకులకు ఎప్పుడు అందుబాటులో వుంటాను అని వారికి తన సహకారం పూర్తిగా అందిస్తాను అన్నారు. ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఇంకా ఎన్నికలకు సమయం 50 రోజులు మాత్రమే ఉందని ప్రతి కార్యకర్త జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు అహర్నిశలు కృషి చేయాలని కోరారు.ముఖ్యంగా గడప గడపకు ప్రచారానికి వెళ్ళేటప్పుడు వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు అర్థం అయ్యే విధంగా ప్రచారం సాగించాలని అన్నారు. గతంలో మంత్రి అమర్నాథ్కు ఎంపీ సత్యవతి అత్యధిక మెజారిటీతో గెలిపించారని అంతకుమించి మెజారిటీతో తన విజయానికి సహకరించాలని ఆయన కోరారు. భవిష్యత్తులో వైసీపీలో చేరికలు మరింత జోరు అందుకుంటాయని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వైసీపీ నాయకులు కొందరు వైసిపి నేతలు తమ ను ఇబ్బందులు పెడుతున్నట్టు వచ్చిన వార్తలను ఆయన దృష్టికి కొందరు విలేకరులు తీసుకువెళ్లగా అటువంటిది ఏమీ లేదని, అమర్నాథ్ గెలుపు కోసం ఏ విధంగా ప్రతి నాయకులు కష్టపడ్డారో అంతకుమించి తన విజయం కోసం సహకరిస్తున్నారని భరత్ అన్నారు. అంతేకాక వైసిపిలో ఎందరో నాయకులను తయారుచేసిన సీనియర్ నాయకులు తమ పార్టీలో ఉన్నారని మాలో అభిప్రాయ బేధాలు కల్పించేందుకు మాత్రమే ఇటువంటి వార్తలు వస్తున్నాయని, వాటిని తాము పట్టించుకోవడంలేదని భరత్ అన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మళ్ళ బుల్లిబాబు, దంతులూరి దిలీప్, దంతులూరి శ్రీధర్ రాజు, గొర్లి సూరిబాబు, మలసాల కిషోర్, కలగా గున్నయ్య నాయుడు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, పెద్దిశెట్టి గోవిందు, జాజుల రమేష్, కే.ఎం నాయుడు, దాడి నారాయణరావు, డాక్టర్ బి.ఎల్ నరసింహ రావు , సర్పంచులు ఎంపీటీసీలు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎన్నికల నియమావళి పక్కాగా అమలు జరగాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నియమావళి శతశాతం అమలు పరచాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణస్థాయి నుండి గ్రామస్థాయి వరకు ఎక్కడా ఉల్లంఘనలకు అవకాశమీయరాదన్నారు. అనుక్షణం అప్రమత్తంగా వుండాలన్నారు. 9 చెక్ పోస్టుల వద్ద తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహిచాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ టీమ్ లు, వీడియో వీవింగ్ మొదలైన వారు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నియమావళి పరిశీలన, అమలు అధికారులు నిశితంగా గమనిస్తూ వుండాలన్నారు.

ఉల్లంఘనలు, డబ్బు- మద్యం, మాదక ద్రవ్యాల రవాణాలపై ఉన్నతాధికారులకు ఎటువంటి ఫిర్యాదు రాకముందుగానే చర్యలు చేపట్టాలన్నారు. తమ శాఖల పనులను చేస్తూ ఎన్నికల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అంతకు ముందు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు గూర్చి అన్నిజిల్లాల ఎన్నికల అధికారులతో సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్ లోఉన్న ఫార్మ్-7,8లను ఈనెల 26 నాటికల్లా పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల కల్పన, అనుమతుల జారీని వేగవంతం చేయడం, సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, ఎలక్ట్రానిక్ సీజన్ మేనేజ్మెంట్ సిష్టం పటిష్టంగా అమలుపరచడం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో అనకాపల్లి నుండి కలెక్టరు రవిపట్టన్ శెట్టితోపాటు జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, డి.ఆర్.ఓ. బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్.వి.జయరామ్, డిఎంఅండ్ హెచ్ వో డాక్టర్ ఎ.హేమంత్, గ్రామ వార్డు ప్రత్యేకాధికారి మంజులవాణి, ఆడిట్ అధికారి గోవిందరాజులు, ఆర్డీవో ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ముఖ్య నాయకులు తో సమావేశమైన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ఇతర మండలంల వైస్సార్సీపీ ముఖ్యనాయకులు ఎన్నికల ప్రచారం ఆయా మండలములలో ప్రారంభం చేయుటకు సన్నాహాలు కొరకు ఈరోజు సమావేశం జరిగింది ఈకార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి సమక్షంలో జరిగింది కంబాల జోగులు మాట్లాడుతా వార్డు స్థాయి నుండి ప్రతిగ్రామం లో కార్యకర్తలు ప్రణాళిక బద్దంగా పనిచేయాలి దీనికి ప్రతి నాయకులు సహాయా సహకారాలు పూర్తి స్థాయి లో అందించి నా గెలుపును పూర్తి మెజారిటీ గెలిపించండి ఇదే మీరు సీఎం జగన్ కు ఇచ్చే పూర్తి మద్దత్తు మరల సీఎం గా జగన్మోహన్ రెడ్డి అయ్యేందుకు కష్టపడి పనిచేయాలన్నారు ప్రసాద్ఈ మాట్లాడుతా మరల సీఎం జగన్ రావడం ఖాయమని సంక్షేమ పథకాలు అన్ని ప్రజలు కు తెలిసేలా ప్రచారం చేయాలని దీనికి ప్రతి ఒక్కరూ బాధ్యత గా పనిచేయడం దానికి అన్నీ విధాలుగా సహకరించగలరని నాయకులు ను కోరారు ఈ కార్యక్రమంలో వీసం రామకృష్ణ శీరం నర్సింహా మూర్తి ధనిశెట్టి బాబురావు చిక్కాల రామారావు బొలిశెట్టి గోవిందరావు మధు వర్మ సూర్యనారాయణ రాజు శ్రీపతి రాజు వెలగ ఈశ్వర్రావు కర్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఎస్.ఎస్.సీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ శుక్రవారం వ్రాత పరీక్ష జరుగుతున్న అనకాపల్లి, గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్ మరియు నర్సింగ్ రావు పేట, నారాయణ హై స్కూల్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. బందోబస్తు ఏర్పాట్లును పర్యవేక్షించి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎస్పీ వెంట అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ శంకరరావు, పాల్గొన్నారు.

## కసింకోటలో భరత్ విజయం కోసం ఆయన సతీమణి నివేదిత విస్తృత ప్రచారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కసింకోట , పూసర్ల వీధి లో అనకాపల్లి వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ గెలుపే లక్ష్యంగా ఆయన సతీమణి మలసాల నివేదిత గడప గడపకు తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భరత్ కుమార్ ని అత్యంత మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్ సతీమణి మలసాల అనురాధ , గ్రామ సర్పంచ్ మంత్రి రజిని , వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి , ఎంపిటిసి ఎల్లపు నూక రత్నం, వార్డ్ నెంబరు కోమిశెట్టి లక్ష్మి, ఎంపిటిసి నాలుగు చెవిటి చంద్రమ్మ, మరియు గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ మరిడిమాంబ పందిరి రాట



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా,పరవాడ మండలం రావాడ పంచాయితి జల్లేలపాలెం గ్రామం లో శ్రీ శ్రీ మరిడి మాంబ అమ్మ వారు నూతన ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం అమ్మవారి పందిరి రాట ఘనంగా నిర్వహించారు.పూజారులు మేడిశెట్టి అప్పలనాయుడు దంపతులు చే పూజా కార్యక్రమం చేపట్టారు .ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా, ఉత్సవ కమిటీ ఛైర్మన్ మేడి శెట్టి మాణిక్యం, మేడి శెట్టి సోమునాయుడు, పితాని అప్పారావు, కట్టా ఆది నారాయణ,పొలవరపు గంగు నాయుడు, దొడ్డి కృష్ణారావు, పోలవరపు నాగ రాజు, పితాని శ్రీను, గ్రామం లో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్‌ను అభినందించిన డిఇఓ వెంకటలక్ష్మమ్మ



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం స్థానిక కె.జీ.బీ.వీ పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎమ్. వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పాఠశాల ఆవరణ అంతా ఆహ్లాదంగా, పరిశుభ్రమైన వాతావరణంలో ఉండడమే కాకుండా చిన్నారులందరూ మంచి క్రమశిక్షణగా ఉండడం చూసి ప్రిన్సిపాల్ సలీమ్, వైస్ ప్రిన్సిపాల్ వి.నాగలక్ష్మిలను ప్రశంసించారు.అనంతరం పదవతరగతి విద్యార్థినుల వద్దకు వెళ్ళి పరీక్షలు జరుగుతున్న తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు వ్రాసిన పరీక్షలు లో ఎంతమంది ఉత్తీర్ణులవుతారని అడుగగా అందరూ ఉత్తీర్ణులవుతామని చేతులెత్తడంతో ఆమె వారిని ప్రశంసించారు. పదవతరగతి అనంతరం చిన్నారులు ఏ అంశంపై ఆశక్తి ఉందో దానిపై దృష్టి సారించి అవగాహన కల్పించుకోవాలన్నారు.అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు . ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఆవరణలో కోడ్ అమలు ఖచ్చితంగా పాటించాలని ఆమె పేర్కొన్నారు.

# ఘనంగా ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ యొక్క 18వ వార్షిక సమా వేశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ యొక్క 18వ వార్షిక సమా వేశం పియు రైల్వే రాంచీ డివిజన్ హతియా రైల్వే కమ్యూనిటీ బిల్డింగ్ హతియాలో జరిగింది. ఇది జెఆర్ సురేఖ వ్యవ స్థాపక సభ్యురాలు అధ్యక్షతన ప్రారంభ మైంది. ముఖ్య అతిథిగా సంస్థ కేంద్ర ప్రధాన కార్యదర్శి అతర్ సింగ్. ఖాండ్వా ప్రత్యేక అతిథి కేంద్ర కార్యనిర్వాహక అధ్య క్షుడు కె.వి.రమణారావు. ఖరగ్‌పూర్. ఉన్నాయి. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారం భించారు. సంస్థ కార్యదర్శి ద్వారా అతి థులకు దుస్తులు. పుష్ప గుచ్ఛాలు, జ్ఞాపికలతో స్వాగతం పలి కారు. కేంద్ర సహాయ ప్రధాన కార్య దర్శి జగ్జిత్ సింగ్ బహల్ ప్రసంగిస్తూ సీనియర్ సిటిజన్స్ అన్నారు. రైల్వే ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, 2 నెలల పాటు మందులు, 18 నెలలకు డీఏను కూడా అందించాలని సూచించారు. వెనుక కిక్‌ను కూడా పరిగణనలోకి తీసుకో వాలి, రైలు ప్రయాణంలో సీనియర్ సిటిజన్‌లకు మునుపటి మాదిరిగానే రాయితీ ఇవ్వాలి మరియు 70 ఏళ్లు పైబడిన సీనియర్ పెన్షనర్‌లను స్థానిక టై అప్ ఆసుపత్రికి రెఫర్ చేయాలి. బహల్ జీ రైల్వే పరిపాలన నుండి ఈ డిమాండ్ చేశారు. సెక్రటరీ చంచల్ కుమార్ సింగ్ వార్షిక నివేదికను సమ ర్పించగా, ఫైనాన్స్ మేనేజర్ బిజన్ లాల్ హల్దర్ లెక్కలను సమర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి తన ప్రసంగంలో, ఎంపి చేసిన విధంగా పెన్ష న్‌ను ఆదాయపు పన్ను పరిధి నుండి తొల గించాలని అన్నారు. మరియు. ఎం.ఎల్. కోసం సదుపాయం ఉంది. కేంద్ర రాష్ట్రపతిని ఉద్దేశించి మాట్లాడుతూ 8వ. పే కమిషన్ ఏర్పాటు చేయాలి. పెన్షనర్ల ఐక్యతను నొక్కి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని భారత ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో సంస్థలో కింది ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. వ్యవస్థాపక సభ్యుడు. జెఆర్ సురేఖ. బికె బినోద్ జగ్జిత్. సింగ్ బహల్ రాణా ప్రతాప్ చౌబే అధ్యక్షుడు కాళీ దాస్ ముండా. ఉపాధ్యక్షుడు. చరణ్‌జిత్ సింగ్. చిత్తరంజన్ ఘోష్. కార్యదర్శి. చంచల్ కుమార్ సింగ్. సహాయ కార్యదర్శి తరుణ్ గాడ్విన్ అశోక్ ప్రసాద్ మన్ని కుమారి. ఆర్గనైజేషన్ సెక్రటరీ అలోక్ కుందు ప్రదీప్ సర్కార్ ఫైనాన్స్ మేనేజర్ బిజన్ లాల్ హల్దర్ డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ శంకర్ ప్రసాద్ సింగ్. మురళీ ధర్ దత్తా. దర్శకుడు. తపన్ చౌదరి. గదా ధర్ కైబర్త్యా. సలహాదారు. ఐ ఎన్. రావు. అరుణ్ కుమార్. నీలమణి ఖలో?. మీడియా ఇన్‌ఛార్జ్ దిలాప్ కుమార్ రామ్. సోమిత్ బరన్ రాయ్.. చివరగా, సంస్థ ప్రతినిధి శ్రీమతి లీలా సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.

# సెయింట్ జోసఫ్ కళాశాలలో మనస్తత్వ శాస్త్రం మరియు వ్యాపార శాస్త్రం విభాగాలపై రెండురోజుల సదస్సు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఉదయం 10 గంటలకి కళాశాల సెమినార్ హాల్లో ప్రారంభమైన జాతీయ సదస్సుని ముఖ్య అతిథి ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఎం జేమ్స్ స్టీఫెన్, విశిష్ట అతిథి ఆంధ్ర వైద్య కళాశాల సైకియాట్రీ అచార్య, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ కే రామిరెడ్డి దీప ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తన అధ్యక్షోపన్యాసంలో ఆహూతులని స్వాగతించారు. జాతీయ సదస్సు లక్ష్యాలని వివరిస్తూ తమ కళాశాల మనస్తత్వ శాస్త్రం మరియు వ్యాపార శాస్త్రం విభాగాలు కలిసి సదస్సు నిర్వహించడం గర్వకారణమని కన్వీనర్, మనస్తత్వశాస్త్ర విభాగాధ్యక్షులు డాక్టర్. డి. రాజ్యలక్ష్మి పేర్కొన్నారు.డాక్టర్ రామిరెడ్డి తన ప్రసంగంలో సెయింట్ జోసెఫ్ సేవా కార్యక్రమాలను ముఖ్యంగా అనాధాశ్రమానికి వృద్ధాశ్రమాలకు వారు అందిస్తున్న చేయూతని ప్రశంసించారు . డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ ప్రసంగిస్తూ ఇలాంటి సదస్సుల ద్వారా నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయించినప్పుడే పరిశోధనల్లో మెరుగుదల కనిపిస్తుందని, సెయింట్ జోసఫ్ కళాశాల, సమాజానికి చే స్తున్న సేవలను ప్రస్తుతించారు.

ఈ రెండు రోజుల సదస్సుకి దేశంలోని ప్రముఖ విశ్వ విద్యాల యాల ఆచార్యులు వక్తలుగా విచ్చేసి మనస్తత్వ మరియు వ్యాపార నిర్వహణలు అభివృద్ధి- నూతన ఆవిష్కరణలు, వాటి ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేస్తారని, దేశంలోని ప్రముఖ విద్యా సంస్థల నుండి వందకు పైగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు మరియు వ్యాపారవేత్తలు పాల్గొంటున్నారని సదస్సుకో- కన్వీనర్ కామర్స్ మరియు మేనేజ్ మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. జ్యోతి తెలిపారు. ఆర్. పావని వందన సమర్పణ చేసారు. కార్యక్రమం లో డాక్టర్ రూపాసెల్వరాజ్ సదస్సు సంచాలన చేసారు. డా. జాన్ పాల్ రాజ్, డాక్టర్ విజలయ శ్రీనివాస్, డా. పి.వీరభద్రస్వామి వ్యాపార సంస్థల భవిష్యత్తు వృద్ధి - అవకాశాలు మరియు సవాళ్లు అంశం పై వక్తలు గా విచ్చేసారు.డాక్టర్ హేమ,డాక్టర్ రజని, హదసా , పావని, ప్రత్యూష, డాక్టర్ అరుణ,డాక్టర్ సుధ, ప్రెస్ ఇన్ చార్జ్ డా. పి. కె. జయలక్ష్మి పాల్గొన్నారు.

# వారసుడొస్తున్నాడు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం పార్లమెంట్ నియోజక వర్గానికి 1991 మరియు 1999లలో రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన స్వర్గీయ మతుకుమిల్లి వీరవెంకట సత్యనారాయణ మూర్తి (ఎంవీవీఎస్ మూర్తి) వంశాకురం మతుకుమిల్లి శ్రీ భరత్‌కు తెలుగుదేశం పార్టీ లోక్‌సభ అభ్యర్థిగా శుక్రవారం నాడు ప్రకటించడం వలన మూర్తి అభిమానులు, తెలుగుదేశం కార్యకర్తల్లో ఆనందోత్సహాలు వెల్లివిరిసాయి. విశాఖపట్నం లోక్‌సభ సభ్యుల జాబితాలో ఎంవీవీఎస్ మూర్తి గణనీయమైన పేరుగడించారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా గీతం కళాశాలను 1980లో స్థాపించి వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిన ఘనత ఆయనకే దక్కింది. 1987-89 నడుమ వుడా ఛైర్మన్‌గాను 2014లో ఎమ్మెల్సీగాను పదవులు చేపట్టిన ఎంవీవీఎస్ మూర్తి 2018 అక్టోబరు 2వ తేదీన 80 ఏళ్ల వయస్సులో ఆకస్మికంగా అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మరణించిన నాటినుండి విశాఖ ప్రజలు ఆయనను మరవలేకుండా ఉన్నారు. ఆయన మనుమడైన శ్రీ భరత్ 2019 లోక్‌సభ ఎన్నికలకు విశాఖపట్నం పోటీ చేసి స్వల్ప తేడాతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై ఓడిపోవడం మూర్తి అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. సీబీఐ పూర్వపు జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీ నారాయణ జనసేన తరపున పోటీ చేసి దాదాపు 3లక్షల ఓట్లు పొందడంతో ఆ ప్రభావం శ్రీ భరత్ ఓటమికి దారితీసింది.

రాజకీయాలకు యువత దూరంగా ఉంటుందనే వారి ముందుకు...నేటి యువతకు తమ కెరీర్ తప్ప సామాజిక బాధ్యత ఉండదా అని ప్రశ్నించే వారికి...రాజకీయాలలో విలువలు ఎక్కడున్నాయండీ అని విమర్శించేవారికి...దేశ పార్లమెంట్ లో మన సమస్యలగూర్చి మాట్లాడిన మనిషి ఏడండీ ..అని బాధపడే వారి ముందుకు...ఓ ఆయుధం దొరికింది.

విశాఖ పార్లమెంట్ స్థానానికి తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీ ఉమ్మడి అభ్యర్థిగా 33 ఏళ్ళ యువనేతను శుక్రవారం ప్రకటించారు. ఆయువకుడే శ్రీభరత్ .. 29 సంవత్సరాల వయ స్సులో రాజకీయ రంగ ప్రవేశం చేసి ప విశాఖ పార్లమెంట్ స్థానానికి పోటీచేసి స్వల్ప మెజారిటీతో ఓటమి పాలైన ఓ యోధుడు ఆయన. ఓటమిని పక్కన పెట్టి కుటుంబం కంటే తనను నమ్మిన ప్రజలే ముఖ్యమనుకుని గత నాలుగేళ్ళుగా ప్రజల వెంటే నడుస్తున్న విశాఖకు సుపరిచితుడైన శ్రీ భరత్ కు విశాఖ యువతలో మంచి క్రేజ్ ఉంది. ఆయన గురించి చాలామందికి తెలియని విశేషాల సమాహారం ఇది.

జీవితాన్ని ఆస్వాదించాల్సిన సమ యంలో మామూలు యువకుడిగా మారుమూల గ్రామాల నుంచి ఉక్కు కార్మికుల ఉద్యమం వరకు సమస్యల లోతును అర్థం చేసుకుంటూ గత నాలుగేళ్ళలో శ్రీభరత్ నడిచిన తీరు ఎంతో ఆసక్తి కలిగిస్తుంది.

అమెరికాలోని పర్డూ యూనివర్శిటీ నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రపంచ ప్రఖ్యాత స్టాన్ ఫర్డ్ విశ్వవిద్యా లయంలో విద్యారంగంపై ఉన్నత డిగ్రీని చదివిన శ్రీభరత్ స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి అకాల మర ణంతో గీతం విద్యా సంస్థల బాధ్యతను స్వీకరించారు. 2019 లో జరిగిన ఎన్నికలలో విశాఖ పార్లమెంట్ స్థానానికి పోటీచేశారు. ఈ బాధ్యతలకు ముందు కుటుంబ వ్యాపారాల నిర్వహణలో ముఖ్యంగా విద్యుత్తు ఉత్పాదన రంగంలోని పరిశ్రమలను పర్యవేక్షించి మంచి అనుభవం గడించారు. స్టార్టప్ పరిశ్రమల ప్రోత్సాహంలో ముందుండి నడిపించిన శ్రీభరత్ పారిశ్రామిక సదస్సులలో చేసిన ప్రసంగాలు జాతీయ స్థాయూ నిపుణుల ప్రసంసలను అందుకున్నారు. ఏ అంశం పైన ఐనా అనర్గళంగా ప్రసంగించగలిగిన ఈ యువ నేత విషయ పరిజ్ఞానానికి మేధావులు సహితం విస్తుపోతారంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలోని వివిధ దేశాలలో పర్యటిస్తూ వర్తమాన, భౌగోళిక రాజకీయాలపై పట్టు సాధించడమే కాకుండా తనను మరింతగా మలచు కోవడానికి హైదరాబాద్ కేంద్రంగా కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అనే విజ్ఞాన కేంద్రాన్ని నెల కొల్పారు. ఐక్యరాజ్య సమితిలో పనిచేసిన నిపుణులు, వివిధ దేశాలలో భారత రాయబారులుగా సేవలం దించిన ప్రముఖులు, భారతీయ రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వంటి మేధావులు, ప్రపంచ బ్యాంక్ నిపుణులు, పలువురు పార్లమెంట్ సభ్యులు, పద్మనాభయ్య వంటి విశ్రాంత ఐఎఎస్ అధికారులతో జరిగే చర్చలలో ప్రధాన ఆకర్షణ కూడా మన యువకుడే.

అంతేకాదు మరోపక్క గీతం విద్యా సంస్థలలోని విశాఖ, హైదరాబాద్,



బెంగళూరు ప్రాంగణాలలో వందలాది మంది అధ్యాపకులు, వేలాది మంది విద్యార్థులు, విదేశాలలోని పూర్వ విద్యార్థులతో జూమ్ మీటింగ్ ల ద్వారా పలకరిస్తూ మార్గదర్శకం చేస్తుంటారు. 10 మంది వైస్ ఛాన్సలర్ లతో సమానం ఆయన ఆలోచనా విధానం అనే ప్రశంసలు లభిస్తున్నాయంటే శ్రీభరత్ మేధస్సు ఏపాటిదో అర్థం అయి ఉంటుంది.

తన రోజువారీ కార్యక్రమాలలో ప్రజలకు సంబంధించినవి తప్పని సరిగా ఉండేలా శ్రీభరత్ చూసు కుంటారు. రాజకీయంగా వ్యక్తిగత విమర్శలు చేయకూడదనే నియమానికి కట్టుబడి ఉన్న ఈ యువనేత విశాఖలో వివిధ సమస్యలమీద డైలాగ్ విత్ భరత్ పేరిట చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతరం లో క్రేజ్ సంపాదించుకున్నారు. పార్లమెంట్ నియోజక వర్గంలో ఏ కార్యక్రమానికి పిలిచినా విధిగా హజరవడం ఆనవాయితీగా పెట్టుకున్నారు.

తనకు ఓటు వేసిన వారే కాదు విశాఖ ప్రజలందరూ నా బంధువులే అంటారు. కోవిడ్19 సమయంలో గీతం విద్యాలయం వసతిగృహలను చికిత్సా కేంద్రాలుగా మార్చడానికి ముందుకు వచ్చారు. గీతం ఆస్పత్రిలో గీతం ఉద్యోగులకంటే తెల్లకార్డులు ఉన్న పేదప్రజానీకానికే తొలిప్రాధాన్యత ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం ఓ సంచలనం. కార్పొరేట్ ఆసుపత్రులలో ప్రవేశం లభించని దాదాపు 5000 మంది గీతంలో కోవిడ్ చికిత్సతో ప్రాణ హని నుంచి బయటపడ్డారు. కోవిడ్ తరువాత కూడా ప్రజల విజ్ఞప్తి మేరకు విశాఖ వ్యాప్తంగా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. ఎల్.జి.పాలిమర్స్ దుర్ఘటన సమయంలోను ప్రజల వెంట ఉంటూ అండగా నిలిచారు. విశాఖ మొత్తం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు పోరాడుతున్న సందర్భంలో మద్దతుగా నిరాహర దీక్షలలో పాలుపంచుకున్నారు.విశాఖ అగ్నిమాపక కేంద్రం ఆధునికీకరణ కు రూ.50 లక్షలు విరాళంగా అందించడం ఆయనకు విశాఖకు గల అభిమానానికి తార్కాణం. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన నౌకాదళ సిబ్బంది కుటుంబాలకు గీతంలో నామమాత్రపు ఫీజుతో చదివే అవకాశం కల్పించారు.

ఓ ఫైర్ ఉన్న యువకుడు వచ్చాడు...ఇప్పుడు మన బాధ్యత ఏంటో తెలిస్తే చాలు మన విశాఖకు ఓ ఆయుధం దొరికినట్లే.

# జర్నలిస్ట్ ల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ జర్నలిస్ట్ ల క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం సింహాచలం దేవస్థానం ధర్మ కర్తల మండలి సభ్యులు, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయము సలహా మండలి సభ్యులు,జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ముఖ్య అతిధిగా హెజరై ప్రారంభించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల మైదానము లో జరిగిన ఈ కార్యక్రమములో గంట్ల శ్రీనుబాబు పాల్గొని మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో ఉండే జర్న లిస్టులకు ఇటువంటి క్రీడా పోటీలు వల్ల శారీరక దేహదారుడ్యము, మాన సిక ప్రశాంతత కలుగుతుంది అన్నారు. ఎప్పటికప్పుడు పరవాడ, గాజువాక గోపాలపట్నం., పెందుర్తి, విశాఖ పట్నంలో ఈ టోర్నమెంట్‌లు నిర్వ హించడం వల్ల. అనేకమందికి క్రికెట్ ఆడే అవకాశం కలుగుతుంది అన్నారు. జర్నలిస్టులకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జెసాప్ సంయుక్త కార్యదర్శి వాల్మీకి నాగరాజు మాట్లా డుతూ గత కొద్ది రోజులుగా తాను అనేక టోర్నమెంట్లు నిర్వహించా నన్నారు. భవిష్యత్తులో ఈ అసోసి యేషన్ ద్వారా మెగా టోర్నమెంట్ నిర్వహించేందుకు. ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. విశాఖ జర్నలిస్టుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ రామకృష్ణ. కార్యదర్శి అనిల్. పలువురు సభ్యులు క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసేపు బ్యాటింగ్ చేసి శ్రీనుబాబు క్రీడాకారు లను ఉత్సాహపరిచారు.




I.V.L. SASTRY SANGEETHA SAMITHI

(Regd. Charitable Trust - 88/2023)

FREE MUSIC SCHOOL - ఉచిత సంగీత శిక్షణాలయం

(With Divine Blessings of Kulapathi Sri Indrakanti Venkata Lakshmana Sastry)

(కులపతి శ్రీ ఇంద్రకంటి వేంకటలక్ష్మణశాస్త్రిగారి దివ్య ఆశీస్సులతో)

29-2-28/1, SBI Colony, Prakasarao Peta, Visakhapatnam - 530 020

Phones : 6302661211, 8309220060, 9989719027

కర్ణాటక సంగీతములో **ఉచితముగా** శిక్షణ నిచ్చుటకు 4 సం॥లు, 2 సం॥లు మరియు 1 సం॥ కోర్సుకు నూతన తరగతులు ప్రారంభింపబడుచున్నవి. నిర్ణీత ఫారములలోని దరఖాస్తులతో తేది 31-03-2024 ఆదివారం ఉదయం 6-30 నుండి 9 గంటలలోపున శ్రీ రాఘవేంద్రస్వామి మఠము వద్ద కలియవలెను. దరఖాస్తు ఫారము, పై అడ్రస్ వద్ద గానీ, అదే రోజున అనగా 31-03-2024వ తేదీన శ్రీరాఘవేంద్రస్వామి మఠము నందుగానీ లభించును.

**1 Year Music Foundation Course**

ఈ తరగతులు ప్రతి ఆదివారం ఉదయం 6.30 గం॥ల నుండి 8.30 గం॥ల వరకు రామ్‌నగర్‌లోని శ్రీ రాఘవేంద్రస్వామిమఠ ప్రాంగణములో శిక్షణ యివ్వబడును. ఇందులో త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలు, శాస్త్రీయ సంగీతపాఠము, రాగములు, తాళములు పోల్చుకొనుట మొదలగు అంశములతో శాస్త్రీయ సంగీత కచేరీని అవగాహన చేసుకొను సామర్థ్యము కలుగజేయు విషయములు నేర్పబడును. ఈ తరగతి 31-03-2024 అదే రోజున అనగా ఆదివారము ఉదయం 8.30 గంటలకు శ్రీ రాఘవేంద్రస్వామిమఠం ప్రాంగణములో ప్రారంభింపబడును.

**2 Years Devotional Music Course**

ఈ తరగతులు ప్రతి గురువారం సాయంత్రం 6.30 గం॥ల నుండి 8.00 గం॥ల వరకు 2 సంవత్సరములు ప్రార్థనశ్లోకములు, అన్నమాచార్యకీర్తనలు, పురందరదాసుకీర్తనలు, జయదేవ అష్టపదులు, నారాయణతీర్థ తరంగములు మరియు వివిధ వాగ్గేయకారుల కీర్తనలు ఐ.వి.యల్.శాస్త్రి సంగీత సమితి ట్రస్ట్ ఆవరణలో డో.నెం. 29-2-28/1, శ్రీ పి. జగన్మోహనరావు (అడ్వకేట్) గారి నివాసం, ఎస్.బి.ఐ. కాలని, సి.యం.ఆర్. షాపింగ్‌మాల్ వెనుక, జడ్జికోర్టు ఎదురుగా, ప్రకాశరావుపేట, విశాఖపట్నం - 530 020 నందు శిక్షణ ఇవ్వబడును. ఈ తరగతులు 11-04-2024వ తేదీ నుండి ప్రారంభించబడును.

**4 Years Praveena / Diploma Course**

ఈ తరగతులు ప్రతి గురు, శుక్రవారాలు సాయంకాలం 6.30 గం॥ల నుండి 8.00 గం॥ల వరకు 4 సం॥ సంగీత శిక్షణ ఐ.వి.యల్.శాస్త్రి సంగీత సమితి ట్రస్ట్ ఆవరణలో డో.నెం. 29-2-28/1, శ్రీ పి. జగన్మోహనరావు (అడ్వకేట్) గారి నివాసం, ఎస్.బి.ఐ. కాలని, సి.యం.ఆర్. షాపింగ్‌మాల్ వెనుక, జడ్జికోర్టు ఎదురుగా, ప్రకాశరావుపేట, విశాఖపట్నం - 530 020 నందు శిక్షణ ఇవ్వబడును. ఈ తరగతులు 11-04-2024వ తేదీ నుండి ప్రారంభించబడును.


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676